V. Suryanarayana Reddi
Ex-13 No 7

వివిధకుసుమావళి

V. Suryanarayana Reddi
III form
Board High School
Gannavaram.

ప్రథమగుచ్ఛము

(కవి)

కవికొండల వేంకటరావు బి. ఎ., బి. ..
శ్రీరంగపట్టణము

ప్రకాశకుఁడు :—
గాడిచర్ల రామమూర్తి, రాజమహేంద్రవరము.

రెండవకూర్పు

శ్రీ వేమన గ్రంథాలయము ... స్థాపితము 1933 ... కృష్ణా జిల్లా

రాజమహేంద్రవరము
శ్రీసరస్వతీ పవర్ ప్రెస్‌నందు ముద్రితము.

1928

సర్వస్వామ్యములు కవివి

[redacted] ఇతరులకు 0—12—0

భావానుక్రమము

		రచన.	స్ఫురణ.
1.	నిశ్శబ్దగీతిక	13_ 8_1916	రాజమండ్రి
2.	వృద్ధదాసి	3_12_1915	నరసాపురము
3.	చంద్రగిరి	19_ 1_1915	చంద్రగిరి
4.	వియోగము	18_ 8_1913	చన్నపురి
5.	ఆర్యాంగనాస్వప్నము	25_ 4_1913	రాజమండ్రి
6.	సృష్టిసూక్ష్మము	12_ 8_1916	రాజమండ్రి
7.	చిన్ననిదుర పెద్దనిదుర	?_ 9_1915	నరసాపురము
8.	నాయమెం	30_ 8_1916	రాజమండ్రి
9.	కళాశాల	17_11_1913	రాజమండ్రి
10.	వారినిపాతము	21_ 1_1915	పెద్దతిరుపతి
11.	వింతవిలోకనము	10_ 8_1914	చన్నపురి
12.	శాద్వలసుమము	15_12_1915	నరసాపురము
13.	రాపిరవళిక	17_ 9_1913	పెనుమంచిలి
14.	కృష్ణ	3_ 9_1913	కోటి
15.	రాజ్యపదచ్యుతుఁడు	2_ 9_1916	నరసాపురము
16.	వర్షానంతరము	25_ 8_1913	శ్రీరంగపట్నము
17.	సారంగధర	11_ 1_1913	రాజమండ్రి
18.	తీవ	?_11_1915	నరసాపురము
19.	జన్మస్థానసంస్మృతి	24_12_1912	రాజమండ్రి
20.	ప్రత్యక్షము	13_ 8_1913	చన్నపురి
21.	చిన్నిలోకమా!	?_ 8_1915	నరసాపురము
22.	అంబుదంబ	20_ 8_1913	శ్రీరంగపట్నము
23.	ధ్రువబుద్ధి	25_ 7_1914	చన్నపురి
24.	కల	26_12_1912	శ్రీరంగపట్నము
25.	ఎఱుఁగరాని	[redacted]	

A119131 97

3

APPROVED FOR USE IN SCHOOLS

Please Vide
Supplement to part I-B Fort St. George
Gazette dated 24th May 1927
Consolidated list of books............revised
up to 1-1-27 page 78

* * *

ఈ పొత్తము పాఠశాలలలో పెట్టవచ్చునని
టెక్స్టుబుక్కు కమిటీవారిచే
నంగీకరింపఁబడ్డది
24-5-1927 ఫోర్టుసెంటుజార్జి గెజెట్టు I-బి భాగము
సప్లిమెంటు చూడనగు.

హెచ్చరిక

ఈపొత్తము మొదటిసారి 1916 న ముద్రితమైనది. అప్పుడు కొలది ప్రతులుమాత్రమే అచ్చొత్తింపబడిన కతమున జనసామాన్యమున కంతవిరివిగ నందకపోయినవి. ఒక కొన్నియున్న నయ్యవి రాజమహేంద్రవరము, తణుకు, నర్సాపురము తాలూకాబోర్డుల వారిచేతను నొకకొందఱి పాఠకమహాశయుల చేతను కొనఁబడినవి.

ఇప్పుడయ్యది 24-5-1927 వ తేదీగల గెజెట్టున పాఠశాలల యుపయోగార్థమై యంగీకరింపఁబడిన దగుటచేతను కొందఱు మిత్రు లప్పుడప్పుడు తిరిగి ముద్రింపవలసినదిగ గోరియుండుటచేతను పునర్ముద్రణము చూడఁగల్గినది.

ఈపొత్తమునందలి గుణగణములు వేఱుగ నుగ్గడించుటకంటె సూచించి వదలుట పాఠకులయెడగల ఆత్మవిశ్వాసమునుబట్టి—

17-7-1921 వ తేదీ నొక లేఖనుండి "——మీకవనము స్వభావసిద్ధమై రసములకిక్కయై మృదుమధుర వాగ్రచనల సొంపెసంగి——"

6-8-1919 వ తేదీ నొక లేఖనుండి "——Your book Vividhakusumavali has been recommended for use in Forms III & IV of High Schools by the Inspecter of Schools——"

పొత్తములు వలసినచో,

కవికొండల వేంకటరావుగారు

నరసాపురము

పశ్చిమగోదావరి

అని వ్రాయవలయును.

శ్రీ ప్రేమ గ్రంధాలయము
తెలప్రోలు.

వివిధకుసుమావళి

1 నిశ్శబ్దగీతిక

ఉ. ఊసుపుమళ్ళనుండి తడియూటలు బిల్బిల నడ్డుచెక్కలన్
వీడక జాలువాఱ దరిఁ బెంపగుపచ్చిక కప్పిపుచ్చుటన్
వేడుకమైఁ గనుంగొనుచు విశ్రమ మందితి; నేమిముచ్చటో
యాడెడునద్ది కాఁపు తెలియన్ వలనీని రహస్యవైఖరిన్. 1

ఆ॥ వె. శిశువు ముద్దుమాట శిక్షింప వచ్చుఁబో
పొదలు దాని పలుక బోధితంబు;
కన్నెకలుకు నుడులు కామింపఁ జెలఁగుఁబో
పొదలుదాని పలుక మోహితంబు. 2

శా. ఆసక్తిన్ వినుకొద్ది నుండియును లేనట్లాచు నిశ్శబ్ద భా
షాసారస్వతమందు నైక్యమగు చాయవ్యక్తశబ్దంబు న
న్నాసన్ దవ్వులఁజూడఁజేసెనొక చోనాకూడ్చు కేదారముల్
హాసప్రోద్భవులై శ్రమంపడు మతంగస్త్రీలధమ్మిల్లముల్. 3

కం. ఉన్నట్టుండియు వారలు
సన్నగఁ దమగొంతు లెత్తి సాగించిరిగా

పున్నెపుఁ బురాణపదమును
వన్నెలవిటకానిపాట వచ్చినవెల్లన్! 4

కం. కాలము వేగిరపడియెన్;
దేలికఁ గనిపించెఁ జేయఁ దీఱనిశ్రమముల్;
లీలగ రోదసి యయ్యెడ
వాలాయము వారిపాటఁ బాడుచు తోఁచెన్ 5

కం. పాటకుఁ గూలీయరు; తమ
పాటున కిచ్చెదరుకాని పాడెద రేమీ?
గాటపుఁ బ్రబోధమిదు చా
బోటులకది యొక్క సహజభూషణమేమో! 6

తే. సత్యమా నది! యదియుఁ దజ్జలముభాతి
నిత్యనిశ్శబ్దతనుగూడి నెగడఁ దొడఁగె;
నేర్తునే యెన్నఁడేనిఁ ద న్నిజవిధాన
నాదు గీతిక నిశ్శబ్దమోదికాఁగ! 7

2 వృద్ధదాసి

ఉ. ఇంటివసారపంచ ననుపెచ్చినఱోటను బెద్దవాయఁ బై
కంటను బోసికొం చులవ లల్లనరుబ్బుచుఁజుట్టుఁ ద్రోయుచున్

మంటికినెత్తుగా నిటు కమర్చుచు నుండినవృద్ధదాసి తా
నొంటిగ నాత్మలోనెదియొ యోజఁగుమారిలు చుంటఁ
[గాంచుచున్. 1

మ. ‹‹ముసలీ!రుబ్బగజబ్బసత్తువతెనో?ముప్పూటలన్నంబునున్
నసిగాఁబెట్టుటమానిరో? యటులవిస్తారంబుగాబాష్పముల్
వెసరాలంగనునేడ్చెదేటికె›› యనన్ వేవేగమీఁజేతఁగన్
గొనలన్ ద్రోముచు నూర్పుఁబుచ్చి పనిచేకొంచిట్లు మా
[టాడెడున్. 2

ఉ. "నాన్నయగారు! ఏటికివినంగను నాదగుచిత్రగాథ? యెం
దున్నది తీర్పలేరుకద; యుత్తములెక్కడో కానియుండ రా
పన్నులపాట్లులెక్కఁగొనఁ; ద్రాతదియయ్యెను గష్టజీవనం
బెన్నఁగనాకు, నింకనునినీ! యనిపించఁగనేల నోటితోన్?3

కం. కానీ, యడిగిన వారలు
కానన్ నొడువంగనగునుఁ గలిమిని గొన్నా
ళ్లైన యనంతర మకటా!
ప్రాణంబుల లేమినీడ్వ భారముకాదే? 4

ఉత్పలమాలిక

పుట్టినదానదూపపునబున్నెములచ్చియుఁదూగునయ్యకున్
బట్టిగ;ముద్దుముద్దుగనునట్టిలునంబెనుపంది; వస్తువుల్
పెట్టుక పెండ్లియాడితిని పేరును మోసినపెద్దకాఁపు; నా

పట్టిననోము లీచుటనో? భర్తగతించెను గొన్నినాళ్ళకే
కట్టిడిముండమోత ననుఁగానఁగనోపక నాదుబందుగుల్
పట్టున నొక్కరైనను గడుఁజెన్నెడి భర్తగఁజేసిరి వెండి:—వింత క
న్పట్టెడునేమొమీకు,నలవైపున మాకొలముల్ మగండుపోఁ
బట్టుననేడుమారులు వివాహముకానగునంట:-యంతటన్
బట్టణముల్ విదేశములు పాయక యిర్వురమట్టెమెట్టుచున్
గట్టివయస్సునంబడిన కష్టఫలమ్మును గూడవెట్టుచున్
బొట్టెలనిద్దఱన్ గనుచుఁ బొందుగఁగాపురమొక్కనాల్గునా
ళ్ళట్టెటొపుచ్చఁగల్గితిమి; ఇంకఁబయిన్ దలక్రిందుకానకా
పట్టిన సుంతకల్మిని సభాగ్యత నాపతిత్రాగుడందులన్
దిట్టరి మాయనాసవతి త్రిప్పల దీనను దాన నంతయున్
బెట్టి దరిద్రతన్ మిగిలి పేదరికమ్మున నన్నురోసి, యా
మట్టునెపోయెఁ; గొంపయును మాన్యము లప్పులుపాలు
[సేసె; నా

పొట్టను నేఁపోసికొనఁబోవిడిచెన్ ననుఁ; జిన్నికుఱ్ఱలన్
గట్టు! యటంచు మోసికొని కంఠమునందలి గుల్లగుట్రినే
గుట్టునదాచుకొన్నయవి కొంచునునమ్మక గౌరవంబునన్
గుట్టునఁబెట్టి చాలవఱకున్ జఱిగించితిఁ; బెద్దవాఁడు న
టిట్టుఁ బొలంబుకూలిపని కేగుచుఁదేఁగలవాఁడుకాఁగ గన్
గుట్టెనొ పాడుదైవమునకున్ బడె నల్లవిశూచి, వానినిన్

బొట్టనువెట్టుకొంటిఁ దలపోసినఁ జెట్టువలెన్ గనన్ బడున్
బుట్టినదాది రోగ మొకప్రాట యెఱుంగఁడు కన్నతండ్రినా
పుట్టుక దేటికింక—నటుపోయినఁజావక చిన్నివానినిన్
బెట్టుకయుంటిఁ దెచ్చుకొన వేఱొక సాధన మేమిలేమినేఁ
డిట్టుల మీకు దాసినయితిన్—గల యన్నిదినాలు శక్తిమై
గట్టినదాటగన్ దగదె? కాని కటా! యదియున్ జరాప్తిచే
మట్టుపడేవిధమ్ముగను మానసమున్ వెఱపించుచుండె; నీ
ర్వట్టినయుల్వలే నలుగుపాటవమున్ గనఁజాలకుంటి నిం
కెట్టి యవస్థ పట్టునొకో? యెత్తగసేయునె బిచ్చమున్ననం
చుట్టిని నూగులాడుచును సూఱకె యేడ్చితిఁ గారణాంతరం
బెట్టిదిలేమ లోపమున కే యిరువారలు మీరలన్నియున్"

కం. అనుచున్ జెప్పెడు లోపలఁ
బని యయ్యెను నదియునంత బాబయగారూ!
చనెద నటంచును బోయెను
గనుజూపుల జాలివెల్లి గావెనుఁబఱగన్.

---

3 చంద్రగిరి

—:O:—

సీ. ఓమహాభవనమా! యే మహీశ్వరుఁడు నీ
కొలువుకూటాన రంజిలినవాఁడో;

కొలఁకులఁదామరలార ! చెలఁగు మీ పద్మేర
నే పట్టమహిషి కీర్తించినదియొ;
కొండబురుజులార ! కుశలత మీనుండి
యేసేన శత్రు వంచించినదియొ;
ఓ దుర్గవప్రమా ! నీదు రక్షణమున
నే ప్రజ స్వస్థత నెసఁగినదియొ;

గీ. అట్టి వారెల్ల కాలాన మట్టు వడఁగ
మోడువడు మ్రాఁకు కారాకు జాడలట్లు
నేటికిని మీరు మిగిలి ర వ్వీటిపేరు
చంద్రగిరి వరపుర మని స్మరణసేయ. 1

మ. అకటా! లోతగుకందకంబిపుడు బైలైపోయె, నెత్తైన గో
డొక-చో నేలకుమట్టమయ్యె, ఘనహర్మ్యోత్తంసమామార్గగా
మికి మెట్టమ్యెను, సత్కవీంద్ర నుత సమృద్ధంపుఁబద్మాకరం
బు; కటా! వ్యాఘ్రసృగాలఘాతుకరుతిన్ మ్రోయున్గదా
[సర్వదా! 2

మ. బలమెల్లన్ హనుమంత విగ్రహతతిన్ బల్కంగ, సత్కీర్తిని
శ్చలపుంజమ్మును "నక్క" దేవతలఁ బ్రస్తావింప రాజ్యంపుది
క్కులు తుంగాద్రిశిఖాగ్రముల్ బొగడ, మాకుల్ దోఁచుఁగా
[కున్ననో
స్థలరాజమ్మ ! భవచ్చరిత్రమును గా సంతైన నూహింపం
[తుమే, ?

శా. అచ్ఛోటన్ విరమింతు నొక్కత్రుటి హృద్యంబౌనొ యే
[మైన; నె
మ్మచ్చున్ జూడ నశింపె కానఁబడు నమ్మక్కా! యిటన్
[దక్కఁ, దా
విచ్చెన్ గొండొకతమ్మిమొగ్గకొలనిన్; వీచుల్దరిన్
[బైరుగా
లచ్చంపుంబెనునీడ నోరగిలుఁ బౌర్వ్యాధారభూభృచ్చి
[లల్. 4

సీ. ముతియంపు ధవళిమద్యుతి తులకించిన
మారాజుకీర్తి యీతీసుఁ గలఁగె,
కనుఁజూపు నసమమై యెనసిన మారాజు
నేకఖండంబెల్ల నిట్లుప్రిదిలె,
స్వాతంత్ర్యఫలరాజిఁ బఱగిన మారాజు
కా పెల్ల నీతీరు రూ పడంగ
లక్షకు లక్షలై రాగిల్లు మారాజు
భోగలక్ష్మి యిటులపూర్వ మరసె
గీ. ననఁగఁ దామరాకులనీసు తోణకు లాడు
కొండరాల్ వానపాయల కోతలువడు
నఖిల వృక్షాళిచెడెను ననన్యమైన
నళిని తూరుపుఁ బేర్కొనుఁ దలఁప నింపు. 5

తే. భూత కాలాంధకారంపు జ్యోతి యగుచు
వెలయు నిచ్చోట శేషించు కలిమి యొకఁడె

మిత్ర శీతాంశుమేఘ సుక్షేత్ర గణము
పంటపరిపాలనము లేనిపట్ల వ్యథలొ! 6

శా. కన్నీరై ప్రవహించు నీకనుమ మేఘుంబొండు వర్షించుచో,
నన్నా! రానసుకంపయెత్తునిటఁజాయల్ ప్రొద్దుసాపంగ, రేఁ
జెన్నొ వెన్నెలకాపులియ్యటవిలోఁ జింతించుఁ, బత్నీ
[పతుల్
మన్నింపంగను లేరుగాయనుచు నీమన్నెంబు జీర్ణించెదున్.

---

4 వియోగము

తే. ఏపు చూపెడుపచ్చిక యిక్కలందు
గోవులను మేపుకొనుచును గొంత సేపు.
దట్టమగు చిగురుటాకుల రొట్టఁగోసి
కోఁడెదూడల కిడుచును గొంతసేపు. 1

ఉ. కాలము వెళ్ళబుచ్చినను, గన్పడుచున్నది యింకనెంతయో
కాలము; దానినిం గడఁపగా నెఱిగింపుమి, ఎవ్విధాన? నీ
లీలలఁగాక నచ్చినచెలీ! దయసేయుము రమ్మునాకు నే
వేళనుగూర్చుచుండుతమి వేడ్కల నీచెలువంపుచెయ్వులన్.

చ. నెలవెనుకొక్కనాఁడురమణీయపుఁబిల్లనఁగ్రోవిమ్రోతలన్
గలచు విచారముల్ పొడమఁగన్ నినుఁగోరికఁదీసికొంచుని

ర్మలసలిలమ్ముఁగ్రోలుచును మావిరసమ్ములఁజూఱలాడుచున్
మసలితిఁగాదె యెంతయును మానిని నీకదిజ్ఞప్తియుండదో?

సీ. ఉరుశిలోపరి భూషితోర్వీధరాగ్రంబు
లెత్తుసంజలఁ గొసరించుచోట
తొగలమొత్తమ్ములఁ దులఁదూఁగు కొలఁకులు
లేఁతచంద్రికల లాలించు చోట
పెనఁగి వృక్షమ్ములఁ బ్రేలాడులతలు ద
క్షిణగంధవహుని నూఁగించు చోట,
మాలతీచంపకమల్లికాతతి పిసా
ళించుపూవుల నిఱికించు చోట
భృంగశారికపికీరబృంద మెల్ల
కెరలిదిగ్దంతములను మ్రోగించు చోట
చెండువలెఁ దూలి చెలరేఁగు చిట్టిజింక
యిచ్చఁగొఱికి పచ్చిక సవరించు చోట 4

తే. వేణునాదంపుఁ బలుచని తేనె లందు
సరస సల్లాప శర్కర శల్కలములు
మెదపి తీయముల్ కూర్చితిమే కరంబు
నంటి తిరిగెడు మధుపంపుజంట వోలె. 5

చ. విడిచితినిన్ను; నే విరహవేదనఁ బొల్పడియుంటిని య్యెడన్
దడబడుచుండుడొంకెనల దాసిలతల్ విఱువంగఁబోవుచోఁ

గుడుపఁగఁజాల లేఁగలను గోవులకున్ సరిగాఁగవిప్పచున్
నడువఁగనేర బీళ్ళకుఘనమ్ముగదూరమటంచుఁదోఁచెడున్

సీ. మెలఁత! నీచిరునవ్వుఁ దలఁచు కొలందిని
జాబిల్లిడాలు సంజ్వరము కొలుపు
సకియ! నీకెమ్మోవి చవులనెంచు కొలంది
ఫలము లొక్కొకటి చప్పనగఁ దోఁచు
ముదిత! నీసుమదేహమును స్మరించు కొలంది
తలిరులపానుపు ములుకు నయెడు
వనిత! నీపలుకులు గణియించు కొలఁదిని
పక్షులరుతములు ప్రాఁతగిలెడు,
నెలఁత! నీతోడఁ గడపిన నెలను నెంచ
నీ దినాంతము లెల్లను వృథగఁ జెల్లు
తెఱవ! నీకూటమిని నొప్పు తీరుఁ జూడ
నొంటరిగ నిప్పు డేనిటనుంట, గలఁచు. 7

చ. పిదుకుదు నేను పాలు మఱివెన్నను మీఁగడ నీవుతీయుచో
నుదయమె నేను ద్రిమ్మఱుదు నొప్పుగ ముంతను నీవు
[మోయుచో
నుదకము నేను తెచ్చెదనుష్ణ మొనర్చుచునీవుపోయుచో
మదవతి!దంపతుల్పనిసమంబుగఁబంచుకొనంగనయ్యెడున్

ఉ. గోపకుమారువెంబడిని గొండపొలమ్ముల గోలమందలన్

మేపుచుఁగాలమున్ గడపమేలెయటంచుఁదలంపఁబోకుమా
శ్రీపతియంతవాఁడయినఁ జెందఁగనేరఁడు మర్త్య మోద
[ముల్
జూపఁగలేదు బ్రహ్మయిన సుందరినావలె లోకచోద్యముల్

చ. చిగురులసెజ్జవై చెద,విచిత్రపుఁబూవులమాలలన్ మెయిన్
నగలుగనుంతు,గ్రోవిని ననారతమూదుచువిందుఁగూర్తునె
వ్వగలనుదీర్తుఁ, దీయనగుపండ్లను జల్లని నీర మిచ్చెదన్,
సొగసుగఁ జూపుచుండెదను జుక్కల మబ్బుల సూర్య
[చంద్రులన్ 10

తే. రమ్ము వేగమ్మెవచ్చి, సౌఖ్యమ్ము లిమ్ము
నీవు రాకుండు వేని నోపూవుఁబోణి
యాలకదుపుల విడిచి. యిప్వేళ నేను
పయన మగుచును నిన్ జేర వలసియుండు. 11

---

5 ఆర్యాంగనాస్వప్నము

కం. వేసవి నొక దివసంబున
గాసిలి సాయంతనమున గడుబడలికతోఁ
బూసెజ్జ నొడలు వాలిచి
యేసుఖమును గరము నిచ్చగించుచు నుండన్. 1

సీ. నెమ్మెనఁగమ్మిన చెమ్మట లాఱిచి
మందమారుతము లానంద మొసఁగ
నవయవతతి పడ్డ యలయికఁ దీఱిచి
మృదువైనపానుపు ముదముఁ గూర్పఁ
బవలెల్లఁజెందిన వడకొట్టు నడఁగించి
సాంద్రచంద్రిక కడు సౌఖ్యమిడఁగ
వ్యాపారమునఁగన్న వైకల్యమును మాన్పి
ధ్వనివిహీనస్థితి కునుకుఁ దేఁగఁ
గీ. అహహా! కష్టులకేకద సౌఖ్యప్రదంబు
లంతకంతలై తోఁచెడు నంచు నెంతొ
మదినిఁ దలపోసి గాటంపు నిదురఁజొక్కి
నన్ను నేను మఱచి యప్పుడున్న యెడల. 2
చ. లలితవిచిత్రముల్ గనఁదొడంగితిఁ గన్నులఁ గట్టినట్టులన్
గలయనలేను సత్యమని గట్టిగ నొత్తి వచింప నేర; వేఁ
దలఁపఁగరావుపూర్ణముగ దాపఁగఁజాలనునెమ్మనంబునన్
దెలుపుదుఁ గల్లయోనిజమొఘీనిధులే తెలియంగ నయ్యె
ఆ॥ వె. సౌధరాజతతులఁ జక్కనిబాటల [డుఁ. 3
సుందరోపవనుల సొబఁగుమీఱి
చక్రవర్తినగరసరణిని బఱఁగుచు
వెలయునొండుపురముఁ దొలుతఁగంటి. 4

కం. ఆపురి చెంగట నొక్కవి
లాపము వినవచ్చె దానిఁ గ్రమమున వినుచున్
"బాపము! కొండొకమానిని
వాపోయెడు ననుచు జాలిపడుచును జేరన్. 5

సీ. అపరంజి పసిచాయ నపహసించెడు మేన
వల్కలంబులు వింతవన్నె నెరప
శ్రీకారములమించి చెలువెలర్చెడు కర్ణ
ముల శిరీషము వింతమురువు జఱుపఁ
గంబుసౌందర్యంబుఁ గంకించు గళమునఁ
బూలదండలు వింతపొలుపు నిలుప,
నప్సరసాంగన నదలించు మోమున
శాంతభావము వింతకాంతిఁ బఱుపఁ

గీ. దనరు నిండుచూలాలి నాస్థలమునందుఁ
దనదు కేల్దోయి జోడించి వనటఁ బైకి
దృష్టిఁ దేలిచి కంఠంబు నెత్తియెత్తి
యేడ్చుచుండుటఁ గంటిని నెదుట నిట్లు. 6

ఉ. "ఓయమ! మేనకా! కనుమయో! భవదీయసుతన్ శకుంతలన్
న్యాయ మొకింతయైన నెదనారయ కా వరపౌరవాన్వయుం
డీయెడ వీడె నన్నుదయనీక్షణ సేయఁగదమ్మ వచ్చినన్
దీయఁగదమ్మ నీదరికి నింకెటు పోదును గన్నపాలికిన్

మ. అలయార్తధ్వని నాలకించుచును నేనం దే యటుల్ వింతమై
నిలువన్ ఖేచరమార్గమందుదిగుచుం నేత్రోత్సవంబై శకుం
తల నత్యంత జవంబునన్ దివికి గంధర్వాంగనారత్న మిం
పలరన్ గొంచుఁ జనంగఁగాంచితిని మాయంబాయెనేమో [యనం
తే. ఆప్రదేశముదాటి యింకరుగుచుండఁ
దాపసుల కాటపట్టయి తనరఁ దగిన
వనము నొకదానిఁ గాంచితిఁ గనులబండు
వయ్యె నద్దానిఁ జూచిన యంత నాకు. 9

కం. సమిధలు పర్ణంబులు స
త్సుమములు దర్భలు ఫలములు శుభ్రజలంబుల్
విమల తపోధనులందఁగ
నమితములై వెలయుచుండె నవ్వన మందున్. 10

కం. అందందున్ విహరించుచు
ముందఱ నొకచెట్టుక్రిందఁ బూర్ణశ్రమమున్
జెందిన పతితల తొడపైఁ
బొందిక నిడుకొంచు విసరు పొలఁతిం గంటిన్. 11

మ. ఉపవాసశ్రమ మెల్ల నామె వదనాంభోజంబు చూపించె, ధై
ర్యపుఁ జిత్తంబును నేత్రముల్ తెలిపె, దూరస్థానమే తెంచి [యం
ద పతిం దద్దయు సేద తేర్చుటలు తన్నారీమణిం బొల్చు దూ
రపుఁజూపున్ బొడసూపె నిక్కముసతీరత్నంబనం జెల్లుగా!

చ. అలసతి యెవ్వరోవినఁగ నన్యులు కన్పడరైరి చిత్రమే !
యలఘుచరిత్ర ధర్మవిదుఁడంద్రుజనుల్ నినునాదునాథునిన్
దలపుమిసత్యవంతునిగ న న్గరుణింపుము ప్రాణదానమున్
సలుపుమటంచు లేచి చనసాగెను దక్షిణదిక్కుచూచుచున్.

తే. దానిఁగని శీలయెవ్వర్తొ ధవునిజీవ
ములను ధర్ముండు వడిఁగొనిపోవుచుండ
ననుసరించుచునుండె నటంచు నెఱుఁగఁ
గల్గితినిగాని వెన్నంటగా వశంబె? 41

కం. మఱికొంతవడికిఁ దిన్నగ
నరుగఁగ గట్టెదుట నతిభయంకర మగుచున్
వెఱపున్ గొలిపెడు నొకయెడఁ
గఱకుశ్మశానస్థలంబు గనుఁగొనినాఁడన్. [నన్

చ. పొగలెగయంగనంటుకొనఁబోయెడుకాష్ఠములొక్కచోటు
సగము తగుల్పడన్ గొఱనసహ్యాపుమొండెము లొక్క
[చోటఁబూ
ర్తిగనశియింప భస్మమయి రేగెడు నెమ్ముకలొక్కచోట నా
కగపడె నచ్చటెల్లెడలనర్థ నిశీథిని భీతి హెచ్చఁగన్.

కం. అచ్చట నొకసాధ్వీమణి
వచ్చి మృతుండయిన చిన్నిబాలుని మేనన్
జిచ్చుంచఁగఁ గడఁగుచు నె
మ్మచ్చునవనంచు వెనుకాడ మఱిఁగనుఁగొంటిన్ 17

ఉ. హా!సుత!లోహితాస్య! యిటులాడువటంచును నెంచనైతి నే
నేసమయంబునందుఁ దుదకెట్టియవస్థ ఘటించెధాత యం
చాసతియెన్నియో గతులనాత్మజు రూపవిలాసమెంచుచున్
జేసెను రోదనంబుఁ గడుఁజెప్పగజాలను దానినియ్యెడన్.

తే. ఇంక నచ్చటేమేమొ నాదృష్టిఁ బడియెఁ
గాని సరిగను స్మరణకుఁ గానరావు
స్వప్నమగుటను నేమొ సర్వంబుఁదెలియ
నలవికాకుండె నాకిట నక్కటకట,! 19

కం. ఆరుద్రభూమిఁ గడవఁగఁ
జేరితి నేఁబోయిపోయి చిత్రంపుమహా
ఘోరవనంబున్ వల్లీ
భూరుహతతి కుంజవితతి భూతఘనంబున్. 20

సీ. ఒకసీమ దావాగ్ని సకలంబుకాల్ప వే
ఱొకసీమ మధువు కోరకము తొడుఁగు,
ఒకమూల వేటకాండ్రుచ్చులుపన్న వే
ఱొకమూల మృగజాతి యులివుఁగొలుపు,
ఒకచాయఁ గఠినకంటకములు విఱుఁగ వే
ఱొకచాయ పూలరాలిక లెసంగు,
ఒకవంకఁ బాము లూరకబుసకొట్ట వే
ఱొకవంక విహగంబు లొనరఁగూయు,

నావనాంతరమందున నట్టి యిక్క-
నొక్కయెడ బెదరువడుచు నొక్కయెడల
సంతసించుచు నడకలజఱపి నాఁడఁ
జోద్యములనెల్ల కన్నులఁ జూఱఁగొనుచు 21

చ. అటనడయాడుచుండగనెయంగననోర్తునుగాంచఁగల్గితిన్
బాటబాటఁగారునశ్రువులుపోఁదుడువంగఁజెఱంగుఁదీసి "హా!
యెటువిడనాడిపోయితి మహీశ! నళా! యిదె రెండుచేసితే?
కట! కట! యిట్లు నన్నుఁ గడగండ్లను ద్రోసితె యంచుఁ
[గుందఁగన్.

ఉ. ఎవ్వతె వీవయో! యిటుల నేటికి నొంటరివైతివిందు ? ని
న్నెవ్వరువీడినారటవి? నెందులదాన వటంచు నెన్నియో
యవ్వని తామతల్లిని రయమ్మున నేనడుగంగనుండినన్
రివ్వున నాస్థలిన్వదలి రెక్కలతో ననఁబోతి నెట్టులో.

ఉ. ఆపయిసాగికాంచితి మహాబ్ధిని లంక నశోకవృక్షపుం
దాపున రాక్షసాంగనలు తప్పక కావలికాచుచుండ లో
లోపల,రామరామ, యనిలోగుచునున్న పవిత్రనయ్యో!యే
పాపి తెగించెనొక్కొ పరభార్యను ముచ్చిలనంచునెంచితిన్.

కం. అంతటఁజేరితి రాజస
భాంతరమొకదాని, దాని యతిశయమును నే
వింతగఁగంటిని, నోడువఁగ
నెంతయు రారాజు కూటమే యననొప్పున్. 25

మత్తకోకిల

వృద్ధపౌరులు రాజబంధులు వేషధారులు మంత్రులున్
యుద్ధశీలురు వీరపుంగవు లుద్ధతుల్ ఘనకాయులున్
శుద్ధవర్తులు తంత్రబుద్ధులు శుక్తయోగులు భోగులుల్
దద్ధరాపతి కొల్వునందు ముదంబుగూర్తురు సర్వదా. 26

చ. త్రుటినటనిల్వఁగాంచితిని ధూర్తుఁడుదిట్టతనాన నొక్కఁడ
చ్చటకొకతన్వి వేణిఁగొనిసభ్యులుచూడఁగ నీడ్చి తెచ్చి,య
క్కట!భువనేశుఁ డెచ్చటికిఁగన్గొనఁజీరలనూడ్వఁబోవు టం
తట నలనారి కృష్ణయని ధ్యానమొనర్చుట భక్తితోడుతన్.

చ. అదికనియేమి యాగడమయా! కడనూరకఁజూతురే మహా
విదులరు మీరలంచు నటవెంటనె లేచితి నామెఁగావఁగన్
మది వడి హెచ్చుటెంప నయినన్ దెలివొందితి నంతలోనె, నే
నదియొనరింపకుండఁగనయారె! కలంచు నెఱుంగఁజాలితిన్

ఉ. చూచితి లేచి స్వప్నమునఁ జూచినకాంతలు పుణ్యలౌట వేఁ
డోఁచెను భారతాదులను దొడ్డమెలంత లటంచు మెచ్చు టా
నా!చిరకష్టముల్ వడసి యంతయు నోపికతోసహించు వా
రేచిరసౌఖ్యముల్ కుదిరియెంతయుఁగీర్తివహింతురిమ్మహిన్

6 సృష్టి సూక్ష్మము

కం. సారంగధరుని మెట్టనుఁ
జేరెడు దారికినిజనక చేరికఁగల పా
తేరునకున్ దిగుబాటను
గోరక యలనడుమ నూడ్పుకొండ్ర మసలుచున్. 1

చ. తొలకరి వాననీటఁదులదూగెడు కొండకొలంకుతూమునన్
గళగళ శబ్దగుంఫనమనర్గళమై వినిపింప వీను నిం
దలవడఁ జెంగటన్ నిలిచి యల్లమనోహరసృష్టిబోధ ని
శ్చల వివశాత్మనౌచుఁ గనుఁజూపుల నొక్కక్షణమ్ము
గాంచితిన్. 2

కం. క్రొంజలముల కెంజిగితో
రంజిల్లుచుఁ బిల్లగాలి లాలనములకున్
బింజించెడు నలలెచ్చఁగ
సంజను బొడసూపెఁ గొలను స్తవనీయంబై. 3

మ. దరిపై మొల్కలఁ దేఱుపచ్చిక వినోదంబయ్యె నందందులన్
శిరముల్ చూపెడుతుమ్మచెట్లమునుకల్ శృంగారమైతోఁచెనా
మఱుఁగున్ గూండ్లనుడాగి తెక్కవిదలన్ మైవిచ్చుపక్షుల్ [కిసన్
గఱవయ్యెన్ మిఱిమీఱుమీనముల సోగల్ సొంపుపెం [పారెడున్.

తే. అట్టివేళను వినవచ్చె హాస్యరసము
లొలుకుపిలు పొందు "రతనాంగి! యోసి! రావె!"
"రావె! చిత్రాంగి! యోసి! యీలాగటంచు"
వెంటనే నాదుచూడ్కి యావెంటఁదిరుగ. 5

ఉ. ఆపిలుపాలకించుటనె యాత్మగతంబునఁ జెంతమెట్టపై
నోపెడ పల్లెనోస్మృతి మహోత్సవమెచ్చఁగఁదద్విదేశసం
స్థాపితగాథగానమును జల్లనిగాలికిఁ బుచ్చి యెవ్వరో
యాపగిదిన్ బయల్ వలికి నారనియెంచితిఁగానిముందరన్

ఉ. కంటిని మల్పులోఁ బశులకాపరి నొక్కనితానమాడి వాఁ
డొంటిగ దేహమార్చుకొనుచుండియుదృష్టినిగిడ్చి బెల్లుగన్
మంటినిదీసి లోవిసరి మల్లము మల్లమికంచుఁ బోదమే
యింటికటంచెలుంగునిడు నింపుగ దేనినొ నర్మవాక్యమున్

కం. నేనది కనుగొనుచునె యీ
మానిసి కీప్రాంతమందు మక్కువఁదగులన్
మానవతి యెవ్వరితె యని
యానీటను మంటిసుడుల యంతనెచూడన్. 8

కం. నీడను నికనంతొ నొక
తాడిని డాగుండి తలనుదప్పించుక తా
నేడనుగనఁబడ కీఁతా
లాడెడు నొకమహిషధాము నరసినవాఁడన్. 9

కం. పై నెండకాయ నీటను
దా నాపవల్లెనుండి తనివివి గనమిన్
మానిసి సరసపుఁబలుపా
ప్రాణికి వినఁబడదు చిత్రరత్నాంగనినన్ 10

కం. మఱియొక మా ఱేఁ డించుక
యరమరలేకల్ల నల్ల నందఁపుమంతన్
దిరుగవె రత్నాంగీ యనుఁ
దిరుగవె చిత్రాంగి యనుచుఁ దిరుగఁబాడున్. 11

శా. ఆపాటన్ రమణీయదీర్ఘముగ రాగానన్ దుదన్ బెంచిసి
గ్గేపాటున్ గనఁబోక పాడెఁగద రా యెంతైనమోహానఁ దా
నాపట్టున్ మఱువంగనోపునది పోతైయుంట; నవ్వించదో
దాపున్ గర్ణవినోదినైవినుమమాత్మన్ వింతసంతోషికా!

కం. లోకంబున మూర్ఖులరై
మూకులుగానుండు జనుల ముచ్చటఁగొలుపన్
సాకెదు రచ్యు రహస్యా
శోకస్థలమదియ సృష్టిసూక్ష్మంబౌరా! 13

—:O:—

7 చిన్ననిదుర పెద్దనిదుర

———:O:———

ఆ. వె. నిదుర రాత్రిపూట నేఁ బోవునప్పుడు
ఘడియ యెంతయగుట గణనసేయఁ
గాలమెల్ల నొక్కలీలగఁ గడచెడు,
వత్సరంబు లనక వయసు లనక
వెలుతు రేదియంచుఁదలపోయ నిసుమంత;
కనులుమూయునంత గాఢతమసి
వెలుఁగు చీకటి యను విభజనమే లేక
యొక్క కల సుదృష్టి నొప్పుచుండు.
మనుజజంతురాశి మఱచియే పోవుదుఁ
గునుకుఁగనినయంతఁ గూర్చుసఖ్య
మాతఁ డీతఁ డనెడు నంతర మెఱుఁగని
శబ్దరూపరహితశాంతి యొకఁడు
చిన్న యిట్టినిదురె నన్నింతఁదనియించఁ
బెద్ద నిదురయెంత పేర్మికలదొ!

శ్రీ వేమన గ్రంథాలయము
తేలప్రోలు.

8 నాయమె?

——:x:——

ఉ. నల్లనియుక్కుకాయమున నమ్మికఁగట్టిన దండ పిక్కటో
మ్మెల్లయుఁ బిక్కటిల్లఁ దల నెంతొభరమ్మును మోసి కొంచు న
ల్లల్లన రాజమార్గపునడన్ నడతెంచెడు కూలివాఁ డొకం
డుల్లము తల్లడంపడఁగ నోపికఁబర్విడికొంచు నాసతో 1

ఆ. వె. నాదుబండికమ్మి సేదతీఱఁగనాని
యెదియొ చెప్పఁబోయి బెదరువడుచు
వెనుకనడచుచుండె విసువని నడకమై
వచ్చువాని చిన్నె లచ్చుపడఁగ 2

సీ. క్రింద బాటనురేఁగు కెంధూళిపటలంబు
సీలమండకు నెగచిమ్మ యంట
ఎగఁగట్టి మొలచుట్టు బిగియించి త్రిప్పిన
గట్టిపుట్టము రొంటి పట్టువదల
ఆయాసమునకోర్చి యడుఁగిడునొడలంట
దట్టంపుఁజెమ్మటబొట్టు బలియ
తలను బుజమ్మును తడవు తడవు మార్చి
బరువు రెండింటికిఁ బంచిపెట్ట

గీ. క్షుత్తుచేఁ బొట్ట వెన్నంట నుత్తకాళ్ళ
నీడ్చు చుసురంచు నిఁక దూరమెంతొ యనుచుఁ
దఱుగ దేసాటి కనుచును మఱల మఱల
నన్నుఁజూచుచు నొక వెడనవ్వు నవ్వ 3

ఉ. ఆతనిఁజూచిచూచి యిఁకనాగక ప్రశ్నముభావవైఖరిన్
"మోతను జాలమోసికొనివెళ్ళఁగనేరనిపాటుతోప, నీ
రీతిగ నెందునుండి యెటకేగుచునుంటి" వటంటి నన్నలో
నాతురపాటుమీఱ నతఁడాడఁగసాగెను నేనునూఁకొనన్.4

మ. చలిగంజిన్ వడిఁద్రాగి వేఁగునన నే సంసిద్ధునై యల్లలో
పలిమన్నెంబులనుండి వత్తును కనన్ బందుల్ కలారల్లద
వ్వుల గోదావరికవ్వలన్ నడచితిన్ బ్రొద్దెల్లమధ్యాహ్నమే
కలియున్ గంజియుఁద్రావలేదునడకింకన్ దేలదేయెంతకున్

శా. తండ్రీ! పట్టనమింక నెంతదవు? సత్రంబందుమాపున్న నె
వ్వాండ్రై నన్ బెదరింతురే మొయయినన్ భాగ్యాన కేమున్నదా
గుండ్రాతిన్ బలె బాంద్రభూమిమఱుఁగున్ ఘోరాటవిన్
గోర్లుల్పులుల్
గాండ్రింపుల్ జరియించుమన్నెములప్రక్కన్ నక్కుమా

తే. అని యనెడులోన మాబండి యల్లవేళ్ళ [బోంట్లకున్. 6
పాకలనుదాటి వాని కీవలఁజెలంగు
నేడుమఱ్ఱుల సత్రంబునీడ దరికి
వచ్చినది చూడు మల్లదే పట్నమనఁగ

చ. అదికనునంత నెంతొ వినయమ్మున "నామన వాక్క-" [టంచున
మ్మదపురహాస్యపుం బ్రకృతిమన్ననసేయుచు "వెఱ్ఱిబాగులన్
సదయతఁజూడు" డంచును భుజంబున మోపునువిప్పియం [దులన్
బొదివినగ్రొత్త పన్నిడని మొండిని ఒకటిముక్కఁదీసి యే
విధమున నైనఁ దీసికొనివెళ్ళు నుపాయముఁజెప్పుమంచనెన్

కం. ఏటికి ? కొంపోమంటిని
చీటికి భయమంచువాఁడు చెప్పెఁ దలఁకుచున్
మాటాడక పొమ్మంటిని
వీటికి దాఁ గ్రొత్తయనుచు వేఁడెనుమిగులన్ 9

ఉ. బండిని గడ్డిక్రింద నిడి పైన నల గుమ్మముదాటునంతనే
యిండనితండ్రితండ్రి! యనియెంతయునన్ బ్రతిమాలుకోఁ [గనా
తుండునుదాచిపెట్టి వడిఁ దోలుచు బండిని బోవనిచ్చితిన్
మెండుగసంతసంపడుచుమేనుజెమర్చుచువాఁడువెంటరాన్

కం. ఆటంకము లేకుండఁగఁ
జీటికిసామ్మ్రాయకుండఁ జేరితిమి పురిన్
మాటికి దండం బిడుచును
దాటించినయల్లముక్కఁదగవాఁడు కొనెన్.

చ. కొనుచునతండుఁ “దండ్రి! యటుకూలిని దెచ్చుక యిట్లు [కూడునన్
మనియెడు మేము నట్టడవిమాఁకులఁగొట్టుక వాడుకొన్న నె
వ్వనివో యటన్నతీరుగను బన్నులవేయుచు బీదసాద నె
మ్మనమున జంకుఁగొల్పుటలు మంచియె నాయమె?” యం [చు నన్విడెన్.

---

9 కళాశాల

చ. ఇట నిపుడిట్టిసంజలనెయివ్విధి నొజ్జలతోడఁగూడి ము
చ్చట విహరించి యింటికిని సంతసమొప్పఁజనంగఁజాలునేఁ
గట! యిది యేటికియ్యెడ నకారణచింతన సేయుచుంటి ను
త్కటముగఁ జూడఁజూడ నెదఁదట్టెడు నింతవిచారభార [ముల్.

సీ. సొగలొప్పు శ్యామపున్నాగముల్ తెలిపూలు
జల్లవో? యిదియేమి చల్లకేమి!
ఇంపులో ఘుమ్మను చంపకమ్ములు తావి
గుప్పవో? యిదియేమి గుప్పకేమి!
దిటములై పెఱిఁగినవటవృక్షములు చాయఁ
జూపవో? యిదియేమి చూపకేమి!
పూతమై ప్రవహించుగౌతమి తెమ్మెర
వీవదో? యిదియేమి వీవకేమి!

కిచకిచ మటంచు చూరులపిచుక లిప్పు
డెగురవో యిందు? యిదియేమి యెగుర కేమి!
బెదరి బెదరి గోడల మేఁకపిల్ల లిపుడు
రాయవో యిందు? నిదియేమి రాయ కేమి! 2

ఉ. ఆడరొ? మ్రోలఁబచ్చికబయళ్లను గొందఱు బంతులాటలన్/
పాడరొ? వెన్ననిర్ఝరిణిపజ్జను గొందఱు పాఠపద్యముల్/
కూడరొ? లోపలన్ సభలఁ గొందఱు వాసరచిత్రచర్చలన్/
జూడఁగ నద్దియెల్ల తొలిచొప్పునె పోఁజఱుగంగ నయ్యెడున్. 3

కం. కారా మునుపటియొజ్జలు?
లేరా సంఖ్యను మునుపటిశీలన్ ఛాత్రుల్?
ఈరా మునుపటివిద్యల?
నారయ నదియెల్ల నడచు నప్పటి యట్లే. 4

తే. అయిన నెమ్మనమందున నభినవముగ
నుదయమొందెడు నొకచింత నుండనైతి
నేను కొన్నాళు లింకిందు నేర్వనైతి
నంచునై యుండనోపునో? యదియుఁగాదు. 5

చ. పొదలు కళావిధానముల పొందగు నీవర పాఠశాలలో/
జదివినవారు కారె/ మఱి చాలపరీక్ష కృతార్థులౌచు స
మ్ముదపడువారు కారె/ యిటు మున్గల కాలమునుండి పాఠకుల్/
మదిఁదలపోసిరే/ యిటుల మామక మానసమట్లు వింతగన్ 6

కం. ఏమో వారలు నావలెఁ
బ్రేమంబునఁ జింతచేసి వింతగఁదోపన్
వేమాఱు తలఁచుకొనుచున్ ।
గామితకారణముఁ దెలియఁగాఁజాలరొకో?

సీ. అరయ నియ్యది మన యర్థపుస్తకమందె।
కనిపించు, నీగురుల్ వినఁగనేల?।
ఊహింప నిది మన కుత్తరవాతయె కాదె।
వృథగను నీగురున్ వినఁగనేల?।
భావింపఁ దుపకలప్రశ్నంబులే తెల్పు,
మునుముందు, నీగురుల్ వినఁగనేల?,
తలపోయ నిదియెల్ల తెలుఁగుసంస్కృతముగా
విదితంబె! యీగురుల్ వినఁగనేల?।

గీ. అనుచు, నెంచుకొనుచు, గురుల్ వినుచు, దానిఁ
బెడచెవినిబెట్టి, కొన్నాళ్ళు కడపితిమిగ,
చదివి చదువని చాడ్పున సంతసమున,
నొజ్జలును మమ్ము దయఁ జూచు చుండుకతన.।

హయప్రచారరగడ:—

మఱ్ఱినీడ మంటినాడ
గొఱ్ఱెపిల్ల కొసరిచూడ
భూరుహములు పూలువిడువ

పాఱునదిని బడన నడువ
కూలిపిల్ల కూడు తేఁగ
బాలుఁడొకఁడు బండి లాఁగ
నరసికొనుచు నందుఁబాడఁ
గఱచి గంటఁ గడపు వాఁడ. 9

సీ. అగ్గింపకుందురె న్యాయశాస్త్ర మెఱింగి
తలఁపులన్ నిచ్చలు తగిలియున్న
కొనియాడకుందురె గురువిధానమునేర్చి
కుఱ్ఱవాండ్రకుఁ జెప్పఁ గూరుచున్న
నుతియింపకుందురె జత పరీక్షలుఁ దేఱి
యుద్యోగ పధికార మొప్పియున్న
వినుతింపకుందురె ఘనశిరుల్ గణియించి
గుణియించుచుండెడు గొప్పనున్న

గీ. సన్నుతింపరె పట్నవాసంబు నున్న
బొగడకుందురె పల్లెలఁ బొదలుచున్నఁ
గ్రిందటేడిందు విద్యలఁ గెరలి నట్టి
ఛాత్రసత్తము లీ కళాశాల నెంచి. 10

చ. పొడమెడు యౌవనంపు నెఱిపోఁడిమి వావిరిపుట్టురత్నమిం
పడర కళాప్రయుక్తముగ నచ్చపువిద్యల సానఁదేఱి మె
య్యెడ గురువిచ్చు నెత్తుమపులీనెడుకాంతిఁ జెలంగినట్టియా
కడచిననాళ్ళఁగోర్కె మెయిఁ గ్రమ్మఱరమ్మనవచ్చునట్టివే?

10 వారినిపాతము

మ. తుది నీదర్శనభాగ్య మబ్బెనుగదే! తోరంపుసంతోష మీ
మది రెట్టింపఁగఁ బాపనాశన మహాంభఃపాతమా! నీవు నీ
కదె! చెంతన్ విలసిల్లుచున్ బ్రచురమా యాకాశగంగాం [బుపెన్
రొదతో మబ్బులుముద్దువెట్టుకొననాలోచింపఁ జోద్యంబవే.

ఉత్పలమాలిక

వారినిపాతమా! యిటులపర్వత రమ్య రహస్య సీమలన్
స్వైరవిహారివై రదనపఙ్క్తియనంగ గుహాస్యమందు, మం
జీర మనంగఁ బాదపవిశేషపదంబుల, ప్రేలుముత్తియాల్
పేరన శైలకంఠములఁ, బృథ్వి మెఱుంగన రాలుటాకు న
వ్వారిగఁ గానిపించి తొలిపల్కు తెఱంగున మ్రోయుచుం [దు వే,
కోరిక నాట్యమాడుదె, యకుంఠితమా తలఁబ్రాలువోలెఁ జె
ల్వారుదె, చాటుచాటు వెలివత్తువె; చూడ వినంగ నార! ప
త్త్రీరులు నీకు పోకడలు, తెన్నిదియంచు నెఱుంగలేము, నీ
హోరున నర్థమేమికలదో గ్రహియింపఁగలేము, కానలో
ఘోరమృగాళిఁ దావకసుగోష్ఠి సతంబును బోధసేయు, నీ
నీరముతన్ప నీదు రమణీయవిలాసము కంటి కింపుకాన్

దూరము నివ్వనాంతరపు దుర్గమమాకనుమన్ సృజించెనో!
భేరి నినాదమట్లు వినిపించెడు నీధ్వనిసేతఁ బిల్లలై
చేరి, వియచ్చరాంగనల శ్రీఁగనుసీనడసేత ప్రాయపుం
బూరుషులొచు మోహపడి, పూర్ణమతుల్ ముదుసళ్ళ
[తెల్ నెఱుల్
ధీరున ఫేనమీను నినుఁ దెల్పికినిల్వవటంచు జ్ఞానులై
యారసి, సన్నుతింత్రుకద యాతురతన్ భవదీయయాత్ర
[కుల్.

11· వింత విలోకనము

చ. పదిపయి నాలుగేండ్ల యెలప్రాయపుఁ బెంపువహించు మై
[పసల్
కుదిరిచి కచ్చుకుచ్చెఁదగఁ గూరిచికట్టిన జల్గుచీర సొం
పొదవఁగఁ గన్యకామణి మహోదధి సాంధ్యతరంగఫేనసం
పదలకెలంకునొక్కరితసైృరవిహారిణియాచుఁజొక్కెడున్.

చ. అరయఁగఁ గానరారుకద యాప్తులు బంధులు కానియా
[మొముం
దఱ వెనుకెందుఁ జూచినఁ దదాత్మను నెంతయుఁగోరి యే
[మనో

హాయనకొ యిట్టులట్టుల నడాడుచునున్న దటన్న జూపులం
దరమర యించుకేనిఁ గనన్తైతిఁ గరంబు విమర్శ సేసినన్. 2

సీ. ఎదఁబయ్యెదనుహత్తి నుదుట ముంగురులొత్తి
చలువ పయ్యెరల నాసక్తిఁబీల్చు
విరియురింగు లదల్చి యొరయునందెముఅల్చి
పైఁబడు నీట విభ్రమతనాను
మొలనూలు సడలించి జడ పూలు కుదియించి
గుల్లరంగుల మేలుకోర్కె నేరుఁ
గెమ్మోవి నవుఁదాల్చి క్రేఁగన్నుఁ గవఁదేల్చి
యలయపారాబ్ధి ప్రియానఁజూచు
గీ. నంతియేకాని యితర మొక్కింత కనదు
పలుకరించదు కడు పారవశ్యయగుచుఁ
దనదుహృదయాబ్జమం దెట్టి తలపులూని
మెలఁగుచున్నదొ తెలుపదు తొలఁగిచనదు.

తే. ఎవరి లతకూన యగునంచుఁ దివిరి యెవ్వ
రైనఁ బలికింప యత్నింతురేని నౌర!
నిష్ఫలంబయ్యెడిని నల నిమిషమందె
ముగుదసిగ్గు తొట్రిలఁగ మార్మోమువెట్ట. 4

ఉ. తుమ్మెదయంటులేనినవతోయజరాజముబోల్కి దోషహీ
నమ్మయి కుల్కునాపె వదనమ్మునఁ బెట్టనిసొమ్ముకాఁగఁ
[బ్రే
మమ్ము తలిర్చుచుం బరుల మానసముల్ హరియించి
[నూత్న భా
వమ్ములనిల్పి యారా!కనుపట్టెడు నొక్కని కొక్కవైఖరిన్.

ఉ. ఎవ్వరి చిన్నదానవగు దేటికి నొంటిగ నిట్లు వచ్చితో?
యెవ్వి త్వదీయభావనము లిల్లెటు నాకొక రవ్వదెల్పుమీ
మవ్వపుజవ్వనీ! యనుచుమామకమిత్రవరేణ్యుఁడొక్కఁడా
నివ్వెరపాటుఁదీర్చుకొననీతిమెయిన్ గదియంగఁబోయినన్.

ఉ. ఆతని సాహసంబుడిపి యల్లన నేనిటు పల్కినాఁడ; నో
భ్రాతృవరేణ్య! యట్లడిగి రామమనోహర ముగ్ధచేష్ట సం
భూతకలారహస్యముల పొందికరుల్ వెలియాటలేల యా
కూఁతుకయూరుషేర్విడిచికూర్చెదుదృష్టిసుఖాబ్ధిఁ దేలుమా

కం. అని యతని సమ్మతింగొని
గొనబగు నొక యిసుకతిన్నెఁ గూర్చుని తమిమా
కనుఁజూపు సాగునంతకుఁ
గనుఁగొంటిమి అల్లవింత కన్నియ మిన్నన్. 8

చ. కనికని యామెచెయ్వులను గౌతుకమందుచునెట్టకేలకున్
గనఁబడదింక దవ్వరిగెఁ గన్నియ, యెవ్వరిదా నటంచు నె

మ్మనమున నద్దియెల్లమటుమాయగఁదాలిచియప్పుడప్పు జ్ఞ
ప్తినిఁగొని మేముతద్విధమువింతవిలోకనమంచు నెంతుమే.

12 శా ద్వ ల సు మ ము

చ. జలజలజాలువాఱు నొకసన్ననితీయనిపంటకాల్వకా
వలిదరి నిర్జనంబయినపచ్చని మెత్తనిశాద్వలాంకురం
బులపఱపుర్ మనోహరపుఁ బొద్దును బుచ్చుచునున్న
[నాదు క
న్నులకునుదర్శనీయసుమనోజ్ఞసుమంబొకటల్లెతోఁచుచుర్.

చంపకమాల

తనదగుచిన్నిమోము నొకతట్టునకున్ మఱలించి గడ్డిలో
గొనబగురంగుడాచుకొని కొంకుచునుండిన నంటినిట్లు "ఓ
మనసగుపువ్వమిన్న! యనుమాన మదేల? త్వదీయజీవనం
బునకును సాటియెద్ది? పెనుపున్ గనుదానవు పచ్చికందులన్,
దనిసెదువాఁగుతుంపఱ, విదాహముతీర్చుకొనంగనేర్తువే
నునుఁదుహినంబులన్ ఋతువునున్ బడువానల, నైక్యమా
[దు వే

జినుఁగునుడుప్రకాశమునఁ జెల్వవు వెన్నెల తెల్పులందు, లే
తనవులఁగుల్కు దేయరుణతన్ బ్రభవించెడు బాలభానుఁచూ
డ్కినిరమణీయ సంచలనక్రీడలఁ జొక్కుదె మందమారుతం
బున, బెదరంగనేల? మొగమున్ బెడపెట్టఁగనేల? సమ్మదం
బును విడనేల? యీవ నినఁబువ్వొటు మాఱువచించె
["నన్న! యా
ఘనమగుభోగముల్ పడయఁగన్దగుటల్ మునునీదుపాదఘ
ట్టనమునుదప్పఁజాలినకదాయనియాసఱు బాసితిఁగడున్."

---

13 రావిరవల్లిక

ఉ. పల్లియమూలవీధి నలువంకల నింకొకయిల్లులేదు మా
పల్లనభోజనాలసమయంబయి సందడితప్పె నోషధీ
వల్లభుబండువన్నె కనుబండువొనర్చెడుఁ బంటచేనులన్
సల్లలితానిలంబు వెదజల్లెడుఁ జల్లదనమ్ము మాఁకులన్.
తే. ముంగిలినెసంగుతిన్నెపై మోవ మొలయఁ
జుట్టుఁజోద్యంబు కందోయిఁ జూఱఁగొనుచు
నొండు నవయువానుండు కూర్చుండి యుండె
సృష్టి నగ్గింపనెంచు కవీశుమించి. 2

శా. ఆహాహా! పవలెల్లఁ బాటుపడి ఘర్మాంభఃప్రపూతంబులౌ
దేహంబుల్ తనియఁ జెలంగునిట నీదృక్షంబుగన్ సృష్టియు
న్బాహాబాహినిరాచుకొంచుదమదంభాధిక్యమున్ జూపసం
దేహంబందనిపట్టణస్థులకు సిద్ధింపంగఁ బో నేర్చునే? 3

తే. నీలజీమూతపథమునఁ గ్రాలునిఖిల
గోళముల నిన్నె చంద్రమా! లీలఁ గాంతు
నోగుబాగుల నుయ్యాల లూఁగుచుండి
యెపుడొ నెలకొక్క మాతేపు నెలయుచుందు. 4

తే. ఎడపదడపను వరిమళ్ళతడుపు లందుఁ
గలియు నీసుధాకరవృష్టి కలననేమొ
ధాన్యము పసిమిచాయను దనరుచుండు
వట్టినీటనె యగునేని నట్టులున్నె ? 5

తే. ఇరులుకవిసెడునింతలో నెందు నుండొ
తోయ దాచ్ఛాదితుండయ్యెఁ దొగలతేఁడు
ఓహా! చిమ్మెడు చకచకద్యుతుల నందు
సానరాపిడిఁ దేఱు వజ్రంబు సరణి. 6

తే. నిర్మలములగుకాలువ నీరములను
ఆకుల మఱుంగు వెన్నెలయంద మయరె!
చూచుకొలఁదిని సొంపుగఁ దోఁచుచుండె
మచ్చలు కలట్టిలేడిమైమచ్చు మెఱసి. 7

తే. డోలికలఁ బండుకొనుఁ బసిబాలలట్లు
కెంపు లొలికించు చిగురాకు జొంపములను
గూర్కునొందెడుఁబోలు శకుంతతతులు
కానిచోఁ జెవినిబడదె కలస్వనమ్ము. 5

తే. గోపబాలుండు పొలమున గోగణముల
విప్పి పాలకావడినూని వేణు వూదు
కొనుచుఁ దనయుల్కిఁ జేరెడు వినఁగనయ్యె
హృదయరంజకమైక శ్రీకృష్ణగీతి. 6

తే. ఇంతదనుకఁ దల్లిపొదుఁగు సంతసమున
గడుపు నిండారఁగుడిచి మ్రాఁగన్ను వెట్టు
వెల్లలేఁగపైఁ బ్రసరించు వెన్నెల జిగి
సితశరంబయి నిశ్చలస్థితిని నెగడు. 10

తే. అదియె చలియించు పచ్చిరావాకుపైని
చాయతళుకుఁగుచు మిగులచంచలతఁ బెరయు
అబ్రపడనేల! సహజంబె యద్దియెందు
నాశ్రయంబుల గతులెపో యాశ్రితులకు. 12

తే. అలరుఁగొమ్మల రవళిక నాలకింప
సాఁకబడెనేమొ నిశ్శబ్ద మీకడలను
శాంతమాధుర్యరవము నిరంతరంబు
వినఁగవచ్చెడు నుండిలే దనఁగ నహహా!

ఉ. ఇట్టిమనోజ్ఞసీమ లభియించిన నిర్మ్మలమానసంబునన్
గట్టితపస్వియొండు పరకాంతలఁ దెఱించితపం బొనర్పఁడే?
అట్టననేల యొండునవయౌవనశీలుఁడు ముద్దుగుమ్మఁ జే
పట్టి మనోజులీల కయివారము సేయుచు హాళిఁ దేలడే?

క. అని పలుదెఱఁగుల సృష్టిని
గణియించుచు నడుమనడుమ ఘనముగ నెదియో
వినఁకలిబడ వినుచును నది
తనుఁగాదని యెంచుకొనుచుఁ దరుణుండుండన్. 15

క. అమ్మాయీ! మగనికి నీ
ళ్ళిమ్మా! లేవంగవచ్చు నెపుడునునాల
స్యమ్మయగు నని యెడు వా
క్యమ్మును నోడువంగనయె గృహాంతరమందున్. 16

చ. అదివిని యేఘనన్ బెరటియందలరారెడు 'వర్ల'బావియం
దుదయమునొందె నీరములనొప్పఁగఁ జేదెడునిస్వనంబులన్
బొదలెడుకంకణప్రకట పూర్ణఝుణంఝుణ, మంతకంతక
య్యది తమినాలకించుచును నాదెసనాతని దృష్టిపాఱగన్.

ఉ. లోపలనుండి చంచలవిలోచనయోర్తుక నిండునీళ్ళ చెం
బోపికనొక్క కేల ధవళోచితమౌమడుఁ గొక్క కేల నెం
తోపరువుప్పతిల్లఁ గొని దోపినకుచ్చెనుజార్చి గుమ్మమం
దాపరువంపుమూర్తి కన నల్లనడంకువనుంచి లేచుచున్.

ఆ. ఎన్నికలనుగన్న యించువింటి బిగించి
వదలు మోహకుసుమ బాణ మనఁగ
బొలుపు వలపుఁ దెలుపు బొమగవఁ ద్రిప్పుచు
నొఱపుఁజూపు చుఱుకు నెరపుచుండి. 18

కం. తడిసినహస్తతలాబ్జముఁ
దుడుచుచు నద్దానికతనఁ దొలఁగినపయఁటన్
వడి సవరించుకొనుచు న
య్యెడ ద్వారంబుపయి నొరగ నెంచుచు నుండన్. 19

మ. వనజాక్షీ! యెదిరైననుండు నటనాద్వారంబుపైనానఁబో
కనుచున్ గాంతుఁడు కాంతపాణితలమత్యంతంబుఁ జేఁబట్టి పే
రనుఁగున్ గుప్పుచుఁ జేరఁదీయుచును గాఢాలింగనోద్యుక్తుఁడై
తనవామాంకమునందు నిల్పుకొని యాతన్వంగితో నిట్లనున్

మ. చెలియా! చేతులు లాగకున్న జలముల్ చేరంగ వ్రేళ్లెత్తిగా
నలిఁగెన్ బోఁ గలశంబు తెచ్చునెడ మేనన్ జెమ్మటల్ వోసెనే
యలివేణీ! మొగమట్లు వెట్టకుము సిగ్గందంగ రాదిందు నో
ళ్లలయన్ దంపతులొండొరుల్ తెలుపుకో నాయాసముల్
[తీఱెడున్.

తే. తనదు పదునాలవకళను దప్పికడవఁ
గ్రిందు మీఁదను బడుచుండె నిందుఁ డందుఁ
బద్మముఖి! నీ క్షణక్షణ వర్ధమాన
మైన యాననశ్రీఁ జూపనగును గృపను. 22

కం. కంటేశారద కౌముది!
వింటే నిశ్శబ్దమహిమ! వెలఁదీ! నిక్కం
బింటికిముంగడ నిట్టివి
యుంటొకభాగ్యంబుసూవె యుత్సవమొదవన్. 23

ఆ. వె. కుందరదన! నీదు మందహాసరుచులు
వనజగంధి నీదు తనువు వలపు
లేఁతవెన్నెల నలవాయుపోతములను
వెలితి నెల్లఁదీర్చ వెలయుచుండె. 24

తే. తెల్లనగుఁబూలగుత్తులఁ దెఱవ లిట్లు
తమ వినీలంపుసికలను దాల్చుచుంటఁ
జూచి మబ్బులు చందురు దాచుచుండు.
అల్లదే! చూడు నామాట కల్లయేమొ! 25

తే. అందమున్ జక్కఁజేసికో నబ్బవెరి
యాస్యమునుఁజూప వానితో హాస్యమాడ
సరసి యాత్మతలమ్ము చంచల మొనర్చు
భావహీనమ్ములని వానిఁ బలుక నగునె? 26

తే. కొంక్క మొకయింత గట్టిగ నొక్కుకొనుము
గీసికొనకంటె మెడవంచ కీరవాణి!
పలుకు బంగారమాయెనా వాతెఱలను
మెదపవేటికి? ఱుంచోట మేరకాదొ? 27

తే. రమణి! తెలియుమా వెన్నెలరాత్రులందు
చెలులు చెలువులు కూర్చుండి వలపులూర
ముచ్చటలఁ దేలుదురె యేని ముందుజన్మ
మందు వారు చకోరద్వయంబు లనుచు. 28

చ. పలుకుచునట్టె యాతఁడెలప్రాయపు బాహువునం బ్రి[యాంగనా
లలితవిభూషశోభితగళంబునఁ గౌఁగిలిపూర్తిసేయ జె
క్కులకునుదార్చి నొక్కి కొనగోరులతో నిమురంగఁబోయినన్
నెలఁతుక దానినెల్లరమణీయముగా గ్రహియించినవ్వుచున్.

కం. నాథా! చెల్లునె మనకిటు
వీధిని సయ్యాటలాడఁ బెఱవా రరయన్
శోధింతురు సఖు లెఱిఁగిన
బాధించెద రెకసకియపుఁ బల్కుల నెంతో. 30

తే. అనుచు సనియెడుసతినుడి నాలకించి
హస్తతల మల్లసల్లన నందుకొనుచుఁ
జెక్కుఁజెక్కుఁ దార్కొనఁజేసి మక్కు వెసఁగ
నమలసృష్టి హాస ప్రేరితాత్ముఁ డగుచు. 31

కం. బాలా! భార్యా భర్తలు
హాళిం దేలంగఁగోర నన్యుల వేళా
కోళము లాటంకములా
యీలీల విచిత్రసృష్టి యెన్నఁడుఁ బొడమున్. 32

తే. కలికి! కావలసినప్పుడు కలుగఁబోవు
మంచిసమయంబు లవి యసామాన్యములుజు
కావున యదృచ్ఛ నయ్యవి కానఁబడిన
ననుభవింపంగ నొప్పగుమనుజునకును. 33

తే. ఉవిద! అన్యోన్య మెడఁబాసి యుండునట్టి
దంపతులు ప్రాయశంబుగఁ దలఁచుచుంద్రు
కూడుకొనుటకు రేయెండ వేఁడి వేచఁ
గూడినమనము పీడంగఁ బాడియగునె? 34

ఉ. అంతియకాక యిప్పు డిట కన్యలు వచ్చెడువేళకాదు శు
ద్ధాంతరహస్యలీలఁ దలఁదన్నఁగఁజాలెడు చాడ్పుమీఱు నే
కాంతమెసంగు నిందనుచుఁ గాంతుఁడు సంతసమెచ్చఁ [దృప్తిమైఁ
గాంతసుధాధరంపునవకంబును ముద్దిడుకొన్న మెల్లనన్.

కం. మదవతి నాథునితో ననె
నెదుటనలరు రావిరవళి కెసఁగుచు నుంటన్
ఛదనంపుగూటి నిదురన్
గుదురుపడెడు పక్షి మేలుకొనుటన్ గనుచున్. 36

ఉ. ఎవ్వరు కాంచఁబోరనుచు నిప్పుడు మీరలు వల్కినట్టి వా
క్యవ్వలబెట్టి కట్టెదుట నా ధరణీరుహ సంభ్రమ శ్రుతం

బవ్విహగంబుల౯ నిదురనజ్జడిపెట్టుచు జూపునీదిశన్
మవ్వపుముద్దుఁబెట్టి నను మన్ననమీ రిటు సేయు టెంచు
తే. దాన తరుణుండు వల్కెడుఁ దరుణినెంచి [చు౯.
"నీవు కనుగొన్న దంతయు నిశ్చయంబె
కాని దానికి నొండొక కారణంబు
కలదు నీకును నయ్యది తెలియు సకియ!" 38
తే. "పలికితిని నేను సందర్భవశత నట్లు
కారణంబేమొ చెప్పరె మీరు తొల్లి
మీకుఁ దెలిసినదంతయు నాకుఁ దెల్ప
బాసచేసిరి చెప్పమి పాడికాదు." 39

ఉత్సాహము:—

అనుచు నెట్టివింత కారణాంతరంబు తెలుపునో
వినఁగ మనము సంభ్రమింప వెలఁది ప్రియునికంఠము౯
దనదు మృదులబాహులతలఁ దగఁబెనంగవేయుచు౯.
వినయభావ మెనయ మోము వెడఁదయెడఁదఁ జేర్చినన్.
చ. నెలఁతరో! సాధ్యమే మదికి నీకడ దాపఁగనంచునామె నా
చెలువుడుఁ పక్కకు౯ దిగిచి చెల్వలయ౯ మణికట్లు హ
[త్తుచు౯.
మెలికలు వ్రేళ్ళనల్లుచును మించెడునెయ్యపు శ్రద్ధనొగ్గ వీ
నులకును విందుగాఁ గతమును౯ నుడువంగఁ దొడంగె
[నివ్విధిన్.

సీ. వడకొట్టు ననుకొంచు జడియంగ నేటికి
కలుగుఁబో బొడుగునఁ గాల్వనీళ్లు
ఎండదెబ్బనుకొంచు నెద నొంద నేటికి
పొదలుబో నిరుగడఁ భూరుహాళి
వేఁడిగాడ్పనుకొంచు వెనుకాడ నేటికి
జరగుబో నెడనెడఁ జల్లకడలు
ఆకలియనుకొంచు నాగంగ నేటికి
అమరుబో నూరూర నన్నసత్ర
తే. మనుచు నెట్టెట్లొ సరిపుచ్చుకొనుచు వైళ
మత్యవసరము లైనకార్యములు పిలువఁ
దప్పదని బాటసారులు తెఱలుచుండు
మట్టమధ్యాహ్నమున నొండుచెట్టు క్రింద. 42
ఆ. బండి నాపుచుండి బండివాఁ డందున్న
వారితోడ నిట్లు పలుకసాగె
నిందునుండు నేను ముందుఁ గానఁబడెడు
దారి తిన్నగాన యూరుఁ జేర్చు. 43
ఆ. మీ రడిగినయిల్లు దారినే పోవంగ
రావిచెట్టునొండు ప్రక్కఁ గాంత్రు
దాని కెదుట కలదు త్వరితంబుగను రండు
ప్రొద్దుకుఁ గింకు తిరిగి పోవుటకును. 44

ఉ. ఆపలుకుల్ వినంబడినయంతనె పూరుషుఁడొక్కరుండు బం
డాపుమటంచు గ్రిందదిగి యందున నింకనుగూరుచుండి యే
మో పలుతీరులన్ వివిధయోజనలన్ నిదురించు బాలకున్
లేపుచువచ్చినార మదె లెమ్మిఁక నెల్లిని దీయుమాయనన్

తే. షోడశాబ్దలతా సుమశోభగరిమ
యొడలిఁ దన తావులను నలుఁగడలఁ బరప
బాలకుండును డిగెను బండినంత
నుభయులును ద్రోవఁగొనిరి మృదూక్తులెసఁగ. 46

చ. పురవన శోధచేసితిమి ముఖ్యకులాబ్ధులనెంచినార మెం
దరసిన గాని, యొక్కవిధి నక్కఱలేదనినాఁడ విందిఁకన్
సరిపడఁబోవునే మనకు సత్ఫలమున్ బడయంగఁజాలుదే?
పరుసఁదనంబుఁ బోవిడిచి భావనసేయుము తృప్తినెంత [యున్.

తే. అనెడుఁ బూరుషువచనంబు నాలకించి
మాఱుమాటాడకల్ల కుమారవరుఁడు
చుట్టుపట్టుల జనపదచోద్యములను
దేరకొనఁజూచుచును నడతెంచుచుండె. 48

తే. మొదటియడుఁగునెపోసెడు ముచ్చెమటలు
నొడలిఁ గ్రమ్ముచు దుస్తులు తడుపుచుండఁ
జేరుమాలున నొత్తుకోఁ జెంతనున్న
పొలముగట్టున మామిడి చలువనిలిచి. 49

తే. మెఱకమడిని వేసిన గడ్డిమేటినీడ
కల్లనల్లన దుముకుచు నరిగియందు
జాఱు గింజలనేరుకో జంట కుదురఁ
గూయు మురిపెంపు ముద్దులగువ్వఁ జూపు. 50

తే. అంత కంతకు వేఁడిమి నధిక మగుచు
నందుకొను గాడుపునను నాయాస మెచ్చఁ
గాపువట్టిన కొబ్బరి తోపుకెలన
నాగి యిసుమంత విశ్రమం బంద వేఁచి. 51

తే. కంచెలోపల విరిసి పుష్పించుచున్న
బండిగురివెంద తీవెను వలపుమీఱ
లేవనెత్తుచుఁ దక్కిన లేఁతలతల
గణనసేయని తాళవృక్షంబుఁ జూపు. 52

తే. కనఁబడెడు నీరములు దప్పిఁదనుపుకొంద
మవయవంబులఁ గడుగుద మనుకొనంగ
ఊతి పావంచరేవు నాసీత మగుచు.
దారసిల్లిన చిన్నకోనేరు దిగుచుఁ 53

తే. ఉదకములఁ దేలి రాజిల్లుఁ గొదవపువ్వులు
మిగుల నింపుగ సొంపుగ నెగడుచున్న
విడిచి పుచ్చుచు బద్మముల్ఁ విడుపుఁ బొందఁ
గొఱలు పూతప్రభాకర కిరముఁ జూపు. 54

ఆ. వాని బూరుషుండు వరుసఁ గనుంగొని
తనదు వాక్యములకుఁ దగనోసంగు
నుత్తరంబులట్లు చిత్తంబు నెఱుఁగుచు
మేలుఁగోరి గొడుగు మెల్లనొక్కి
చ. ముడుచుచు రావి యిర్వ్యదియె ముంగల నిల్లదెయంచు [వేఱుగా
నడుగక మెట్లనెక్కుచును నాతలుపుల్ దెఱవంగఁదట్టినన్
వడి గృహమేధి దగ్గఱగుబందుగు లెవ్వరొ వచ్చిరంచుఁదా
గెడ నెడలించిచూచె స్మృతికిన్ స్పృశియింపదు వారిఁ [జూచుటల్.
తే. అయిన మర్యాదకనుక పాద్యంబు లిచ్చి
లోపలికిఁగొంచు బల్లనుజూపి యందు
నెలమి దయసేయు డంచు శీతలజలమ్ముఁ
గ్రోలగానిడి దప్పికఁ గొంతఁదీర్చి. 57
తే. ఎండఁబడి వచ్చినారల యిల్లువిడిచి
యెపుడు బయలుదేఱిన వారొ యిప్వ రిపుడు
సరగ మడిఁగట్టుకొని లెండు జలుపఁ దగును
ముందు భోజనంబేమి మోమోట పడక. 58
తే. అనుచు వడివడి పట్టుపీతాంబరములు
తెచ్చి యిచ్చిన వానినిఁ బుచ్చుకొనుచుఁ

బూరుషుండును సందర్భ పూర్వకముగఁ
బలుక సాగెను నించుక బయలు పడఁగ. 59

తే. ఆర్యసత్తమ! యేమాత్ర మన్యసరణి
నెంచబోకుడు మీరలు వృద్ధు లగుట
మమ్ములను జూచియుండరు మాజనకుల
జననులను దెల్ప నెల్ల విస్పష్టపడెను. 60

తే. అంతెకాక వచ్చిన కార్యమంత యిందు
సానుకూలంబు కాఁగలదేని ముందు
మీరు పిలువకే వచ్చెదువార మెన్ని
సారులైనను మీయూరు దూరమనక. 61

తే. అచ్చెరువుహెచ్చె దాన గృహస్థుమదిని
నిట్టులట్టుల వెనుముందు జుట్టుపట్ల
తలచి యెవ్వరో వారి బాంధవ్యమెదియొ
స్మృతికిరామి మగుడ శ్రద్ధఁ జెవులనొగ్గె. 62

ఉ. అంతటఁ బూరుషుండు తమ యన్వయమున్ దమ తల్లి
[దండ్రులన్
సంతస మొప్పఁజెప్పనది సర్వముఁ బూర్తిగనాలకింప క
త్యంతముదంబునన్ బలికె ‹ఆ! యిక నెల్లనుగోచరంబె
[మీ
రింతకు వచ్చు టెంతయును నీక్షణ భాగ్యమటంచు నేడ్తె
[అన్. 63

తే. పలికి వాస్తవ్యుఁడింటి లోపలికి నరిగె
నంతవఱకును నాశల నరయుచున్న
బాలకుఁడు నవ్వి పురుషుని బలుకరింపఁ
బోవుచుండిననంత సమ్మోద మెలర్ప. 64

సీ. కమ్మకస్తూరి తైలమ్ము నొత్తిన నల్ల
ముంగురుల్ మోమున ముసిరియాడ
అగులుబొట్టును బట్టియద్దిన నునుఁగెంపు
కుంకుమ నుదుటను గులుకుఁ గొలుప
తడిగుడ్డతుడుపులఁ గడుదిద్దిన బెళుకుఁ
గాటుక కన్నుల నీటు నెరప
ఒడ్డాణమునుఁజేర్చి యొప్పించు వలెవాటుఁ
బయఁట నెమ్మేనున వలపు నిలుపఁ

తే. గన్నెయొర్తు పడమ టింటి గడప దాటి
కొంకువందియల్ మ్రోయంగ గూటిదరికి
నేగి పాత్రముల్ కొంచును సోగచూడ్కి-
వారిపైఁ జూచిచూడని తీరుఁ బఱపె. 65

తే. పిల్లచూపునఁ జిన్నవాఁ డుల్లమందు
సంతసిల్లి పురుషునకు సంజ్ఞచేసె
పూరుషుండును నద్దాని తీరెఱింగి
బాలికనుగూర్చి ముద్దగు పలుకు లొనర. 66

కం. అమ్మాయీ ! బడి కేగుదొ
"రమ్మా! యిటులొక్కమాఱు రమ్మా" ! యనియో
గొమ్మయు రమ్మని యనఁగన్
నెమ్మికఁ దాపునకువచ్చి నిలువంబడుచున్. 67

చ. పొడమెడుసిగ్గుచేత నెఱిమోమును వంచుచు బల్లపైని గో
ళ్ళిడి యొకవింతగీయుచును నింపుతలిర్చను బూరుషుం
[డునుం
"బిడియము చెందకమ్మ యదివేగమె బాబయ వచ్చు
[వారు మా
కడలను గూరుచుండు" మని కన్నియనుం బయికెక్క సే
[యుచుఁ.

ఆ. చిక్కు వడిన యట్టి చిన్నికాసులపేరు
సరిగఁ దీసికొనుచు నరుణచరణ
యుగము దాగమడచి యొప్పుగఁ గూర్చుండఁ
బేరుచెప్పుమన్నఁ బేరుచెప్పె. 69

ఆ. తీవ్రమైనయెండ దిగజాఱి నీడయు
జగిలెపైని వ్యాప్త మగుట నరయ
బడికిఁ బోవువేళ యపుడెకావచ్చెనా
యీవు చదువు తరగ తెద్ది యన్న. 70

ఆ. బడికిఁ బంపరచటఁ బాఠంబులందున
నేర్వనుండదంచు నేప్పచుంద్రు

నాన్నగారె తీఱి యున్నప్పుడెల్ల మా
యరుగుమీఁద వీని నంచుఁ దెలిపె. 71

ఆ. ముందునుంచుకొన్న పొత్తంపుఁబుటలను
దీసి యొక్కటొకటిఁ ద్రిప్పుచుండ
నేమిపుస్తకంబు-ఏది పాఠమొకటి
చదువు నీవెతీసి చదువుమన్న. 72

తే. బాలరామాయణంబని వడివడిగను
వనిత ! నాతోడ నేటికి వనములకని
రాఘవుండన వానితో రక్తిసీత
పలుకు ప్రత్యుత్తరసువాక్యఫణితిఁ జదివె. 73

ఆ. చెంతనున్న పలకఁ జేతితో నట్టిట్లు
చెఱపి గీతపెట్టి చెఱుపుచుండ
లెక్కసేయఁగలవ యొక్కటిచ్చెద నిదె
చేయుమన్న శ్రద్ధఁ జేయగలిగె. 74

ఆ. తలఁపునకును నేడొ తట్టంగ నద్దాని
నూహసేసికొనుచు నూరకున్న
పద్యపుస్తకముల పఠియించితివ యేని
యొప్పగించుమమ్మ యొక్కటన్న. 75

తే. ఏ శతకమందు పద్యమో యెంచుకొనుచుఁ
గొంతసేపు యోజించుచుఁ గోకిలంపుఁ

గంతమునునెత్తి పఠియించెఁ గడకునొక్క-
కందమును గుమారీశతకంబు నుండి, 76

ఆ. ఉండియుండి యెదుటనున్న బాలకు పైనిఁ
జూడ్కి-నిల్పి మిగులఁ జోద్యముగను
క్రొత్త రాగమొండుఁ గూర్చు కొనుచు నుండఁ
బాట నొక్క-దానిఁ బాడుమన్న. 77

ఆ. చెలువ చాలతడవు సిబ్బితిఁ బడుచును
బాడెఁ బూఁచెండ్లపాట నొండు
వినెడువారి కెంతో వీనులవిందుగా
స్వాదురసము లొలుక వరుసఁ బెట్టి. 78

ఆ. ఏమిసేయుచున్న నిదియేమి వీరలు
ఎదియొ యొండుదాన నిచ్చుచుండి
రనుచు నిట్టునట్టు లరయుచు నుండంగ
"అమ్మ! యొక్క-మాఱు రమ్మటంచు." 79

ఆ. పిలువనయ్యె దానఁజెలువనుఁ బురుషుండు
వెళ్ళవచ్చునమ్మ తల్లిపిలుచు
నన్న బల్లదిగుచుఁ గన్నియ లోపలి
కేగి నిల్చి యమ్మ! యేటికనియె. 80

తే. తల్లి వెండిగిన్నె పిల్లచేతికి నిచ్చి
పిన్ని యింకఁ దోడుపెట్ట దేమొ

దీనఁ బాలు తోడి తెమ్మని కయ్యెడు
న త్తవారు వారటంచుఁ బలికె. 81

చ. అదికనిపెట్టి వారి కపు డాగఁగఁ దీఱిక లేమిఁ గ్రొత్తఁగా
బొదలెడుఁజన్వుఁ జూపుచును బూరుషుఁ డాయిలుసొచ్చి [“యయ్య! ఏ
మిది శ్రమనొందబోకుఁడిట నిప్పుడు నిల్వఁగఁగాదుమాకువె
శ్లిద” మని పల్క, “వచ్చితిరొ లేదొ యిటుల్ చను దేరభా [వ్యమే”

తే. అనుచుఁ బీటల వేయంగఁ బనిచి వారి
నందు విచ్చేయుఁడంచును నరుగు దెంచి
నట్టి కార్యంబుసర్వంబు నందు జరపి
నట్టిదాని నెఱుఁగుచు గృహాధిపతియు. 83

కం. వా రిఁక నుండమటంచున్
సారెవచించినకతమున మఱి మీకరుగ
గోరిక యుండిన నే మన
నేరుతు నేఁ బ్రొద్దుపోవునిలిపిన ననుచున్. 84

ఆ. తిరిగి పురుషునాపి సరిగ మా యిల్లెనఁ
జూడలేదటంచుఁ జుట్టుఁ బెరడు
గదుల నెల్లజూపి మదిలోని కోర్కెల
సరవిఁదెల్పె నెంతొ సరసముగను. 85

ఆ. బాలకుండు మాత్ర మాలోపుననె తాను
వీధియఱగు నాని వింత నిలిచె
నుక్కపోయునింట నుండంగలేమి నో
యాత్మఁబొడము తలఁపు లాపలేకొ. 86

తే. అతని హృదయసరోవరమందు నల్ల
కన్యకాదృష్టిపతనము గాట మైన
భావ వలయుంబులను గూర్చి ప్రతిరుతమన
వాక్యముల నివ్విధిని బయల్ వడఁగఁజేసె. 87

తే. "భ్రమరమా! యింక నీ పరిభ్రమణ ముడిఁగి
యా నవోత్ఫుల్లపద్మంబు పైని వ్రాలి
యలవడెడు స్వాదుమధువుల నానుకొనుచు
సంతతంబునుగనుము నితాంతశాంతి. 88

తే. తిరిగితివిగ కాననముల నరసితివిగ
కొలఁకులను జూచితివిగ తోటలను మిగుల
చంచలంబని చూపఱు లెంచుకొనఁగ
నెఱుఁగవో యిందు నీసుమ మెసఁగుచుంట. 89

ఉ. నీమనమందు నెట్టుకొను నిష్ఠురచింతల నెల్లఁబాపి స
త్ప్రేమముఁబెంచినిన్ను పరితృప్తముగానొనరింపఁగల్గుచున్
గామిత మోదమిచ్చెడువికాసయుతమ్మగు మానసాబ్జమే
మేమియుసందియంపడక యీవు వరింపఁగఁ జెల్లునిచ్చమై.

ఉ. ఈవసుధాస్థలిన్ గలుగ దెయ్యెడ నచ్చినదంచునన్న యా
తావకరూఢివాక్యమును దబ్బఱసేయ నదృష్టదిష్టమై
చేవడుచున్న యీాయనుగుఁ జెల్వపుఁబూవును జెట్టపట్టిన
ద్భావసువాసనల్ కఱపి తద్దయు నిశ్చలసౌఖ్యమందుమా!

తే. తొలుత నీ నుండి తమినిటు దొంగిలించు
కొనిన మోహనైక్షణములు దినదినమ్ము
వృద్ధి కాంచకయున్నె విశుద్ధముగను
స్వాతిచినుకులు శుక్తినిఁ బ్రబలుసరణి. 92

తే. దైవమును నెంచి యుండు నద్దాని నీకుఁ
గాక పోయిన నీ విటు రాక యుందు
కోకిలము సేరునే లేఁతకొమ్మ నెఱిఁగి
మలయవాయువు కూర్పంగఁ దలఁపకున్న. 93

కం. నీ మది కెయ్యది యింపో
యా మాడ్కినె సేయఁదలతు రార్యులు నీ కిం
దేమాత్ర మెదురు వలుకరు
ప్రేమం బిట నిశ్చయింప వెరుదీయకుమా.'' 94

కం. అని పలువిధముల నా క
న్నెను దమిఁ బరిణయ మగుమని నెమ్మదికిన్ బో
ధన సల్పుచు నిల్చిన బా
లుని కన్నులకగపడె నల లోలాక్షి మఱిన్. 95

ఆ. జనని పనిచినట్టి పసుపునఁ బాలను
బూని వచ్చుచుండెఁ బొందుకుదురఁ
దనకు నత్తవారె యనిన వాక్యంబులు
మదిని నొక్క వింత మమతఁ గొలుప. 96

కం. ఆ రమణి నడక తీరును
నారసి యబ్బాలకుండు నాశ్చర్యముగన్
గోరిక లుప్పతిలంగను
నీరీతిన్ దలఁపసాగె నింకయుఁ దనలో. 97

తే. "కన్నె సౌందర్యసంపద గరిమ కంటె
స్వాదుకలకంఠ కంఠభాషణముకంటెఁ
జూడ సొబగైన కనుఁగవ చూడ్కి కంటెఁ
గడు మనోజ్ఞత లొలికించు నడలకంటె. 98

తే. ఘనతరంబుగ నెద్దియో కడలు కొనుచు
మామకాత్మను హరియించు మఱలమఱలఁ
జూచుకొలఁదిని నొకవింత తోఁచుచుండి
క్రొత్త నెమ్మని మది నిగురెత్తసేయు. 99

తే. అతిదృఢం బగుశాఖల నంటి యున్న
నట్టులిట్టుల దడదడ నాకులాడు;
అతి విశాలాంబరంబున నలరుచున్న
జలజహితమండలముకుమారిలుచు నుండు. 100

తే. కాని కోమలి మృదులంపు కరతలముల
నలరు ధవళంపు క్షీరంబు లనుభవించు
నతులస్వస్థత హృదయమా! యరయ వారొక్క?
వదలకుము తత్సుఖస్థితి వదలఁబోకు." 101

తే. అనుచుఁ దలపోయునంతలో నాగృహస్థు
నుండి శలవును గొని పూరుషుండు "తప్ప
కింటి కేగినవెంటనే యెల్ల మేమె
యుత్తరమువల్ల దెలుపుదు ముందుఁ డింక. 102

చ. వెనుకకుఁ బిల్వఁ బోకుఁడిఁక వెళ్ళుచునుంటిమి మీకునల్లుఁడై
యనయము పండుగుల్ పిలువ నర్మిలి వచ్చెను వాఁడితం
[డు" "జా
గొనరిచినార మిందుఁగడు నుండునె యింకను బండి య
[చ్చోటన్"
"గనుగొను మింక నొక్కపరి కన్నియ యున్ మన మ్రోల
[వచ్చెదున్."

తే. అనుచు వీధి గుమ్మముదాటి కొనుచు నందు
నిలిచియున్న బాలుని భుజములను సేయి
వైచి చిరునవ్వు నవ్వెన బాలకుండు
మోహపుం లజ్జవడుచు మాగోమ్రము వెట్టె. 104

తే. బాలికయు వారిఁ జూచిన వడినె యొక్క
వింతపుయిలోటఁ బొందుచుఁ జెంతనున్న

కోమలచ్ఛాయ సౌభాగ్య రామమైన
రావిచెట్టుమాటున డాగి త్రోవ యిచ్చె. 105

తే. సిగ్గులొగ్గిన వారల చేష్ట లెంచి
రావికొమ్మంతఁ బూనెను బ్రీతిన నిట్లు
యిప్పుడింతఁగ లజ్జించు నీయిరువురు
నొండొరుల్ ముద్దు లిడుకొను చుండఁ జూతు." 106

తే. అనుచుఁ జెప్పిన కతమెల్ల నాకలించి
పువ్వుబోణియు తెలి చిఱునవ్వు లొలుక
"తత్ప్రతిజ్ఞనె యీ రావి తలఁచియున్నఁ
బూర్తి నెఱవేఱకే సిద్ధిఁ బొంగుచుండె." 107

తే. అనుచు నాథునియరుణ హస్తాబ్జతలము
లేవనెత్తుచు ముద్దాడి "లెండు మీర
లన్నయును నదె మడిగట్టు కొన్నవాఁ" డ
టంచుఁ బలికెను గాంతుఁడు నట్లొనర్చె. 108

తే. వా రుభయు లంత తలుపును జేరవైచి
కొనుచు వెడలినారలు నాటఁగోలె నందు
వచ్చు కవులకుఁ దానట్లు పట్టినట్టి
ప్రీతిన నెఱవేఱు టనయ మా రావి వినుచు. 109

14 కృష్ణ

—:o:—

ఉ. ఇక్కడ కేను దొల్లిష్టొకయేడునఁ జూడఁగవచ్చినప్డు మా
యక్కయుబావయుఁగలిసి యాలను లేఁగలమేపుకొంచునీ
యిక్కలఁబ్రొద్దుబుచ్చెదును, నేమిదికన్పడకుండెనేమియున్
అక్కట! తాఱుమాఱయినదంతయునెందుననున్న వారొకో

సీ. తెలివేకువలయందుఁ గలరవంబులఁగొల్పు
పెద్దవృక్షములు వ్రేళ్ళఁ బెల్లగిల్లె
రెండుజాములవేళ నిండునీడ నొసంగు
పూలపందిరినేలఁ గూలఁబడియెఁ
సాయంతనములందుఁ జల్లగాలినివీచు
ఘనశిలాతలములు తునుక లయ్యె
రాత్రిభాగమునందు రక్షణంబొనఁగూర్చు
చిన్నకుటీరంబు శిథిల మొందె. 2

గీ. మేపునొప్పెడుపచ్చిక లెండువట్టె
దొడ్డికట్లల్లపుచ్చునఁ దొఱగిపోయె
కోఁడెదూఁడలరాట్లన్ని యూడిపడియె
చిన్నత్రాళ్ళుట్లుసర్వము చీకునొందె. 3

తే॥గీ. కడుపులెల్లను అయ్యయో! చెదరిపోయె
పడమటావులు కటకటా! బక్కచిక్కె

ఆల బోతులిస్సిరో? కుమ్ములాడుకొనెడు
నెట్టిపాపము పుట్టెనో చుట్టుపట్ల. 4

కం. వినఁబడదు వేణునాదము
వినఁబడవుగమందకుక్క బిగ్గఱమొఱుగుల్
వినఁబడవుగొల్లసుద్దులు
వినఁబడ దొకయీలయయిన వింతఁగుఁ జూడన్. 5

శా. హా! కృష్ణా! యెటు పోయితీవయయో! అన్యాయంబుగా
[దోఁచెదున్
నాకున్ జెప్పఁగలేకపోయితివె? అన్నా! మృత్యువున్ బొందితే
లేకుంటే కనకుందునే జగతి నీలీలల్ వినన్ నేరనే
యేకాఠిన్యపదార్థముల్ బెటికెనీయింపైన ప్రాణంబులన్.

కం. వడగండ్ల వాన నైనను
వడకని నీమేను పెద్దపామున కైనన్
జడియని నీ మానసమును
పడిపోయెనె ఘోరమృత్యువాతను కృష్ణా! 7

కం. నీ వేణువాదముల నిఁక
నేవేళను వినఁగనేర నీపికగీతా
భావంబుల నాకెందును
కావలెనని యన్నఁగాని గఱపవుఁ కాదే. 8

ఉ. ఈ సెలయేటి నడ్డుపడి యీఁదఁగనేరరు గోపబాలకుల్
వేసెద నొక్క త్రాటినని వెన్కవచించితి వేసినాఁడవే ?
యీసమమైన చెక్కనొక యింటిని గట్టెదనంటి కట్టితే ?
హా! సఖ! యేమిచేయఁగలవంతయునిన్నటుముంచి వేయుచో
ఉ. కోరిక లెన్ని యేని మదిఁగూర్పఁగ వచ్చునుగానియవ్విచే
కూరెడు భాగ్య మబ్బఁగ నకుంఠిత జీవిత ముండవద్దొకో?
ధారుణి నిల్చి యీజన పదంబుల కెంతయు మేలు సేయుస
ద్భారము చాలబూనుదని తద్దయు నేఁ దలపోసి యుంటి
తే. ఇంక నెప్పుడో నేమంద లేలునపుడు [మున్.
నీదు చెంగటనే యుండి మోదమునను
నిర్వ్వరము తోడు నీడగ నెసఁగు వార
మనుచు నాసించి యుంటిని ననవరతము. 11

సీ. లలితంపు సెలయేటి జలజలం బాలించి
యూహించు చుందుమే యొక్కనాఁడు
కొమరు మీఱెడు కొండ కోనల విహరించి
యుప్పొంగు చుందుమే యొక్కనాఁడు
తులకించు చుక్కల తళుకుల బాడఁగాంచి
లెక్కించు చుందుమే యొక్కనాఁడు
నచ్చిన విరివైన పచ్చికలను వేణు
వూదించు చుందుమే యొక్కనాఁడు. 12

గీ. ననుచు మురిసెడు వాడఁనో యనుఁగు మున్ను
నిట్టు లగునని యెన్నండు నెంచ లేదు
కట్ట! ధైర్యంబు నాకింక నెట్టులుండు
కార్యముల బూని సఫలతఁ గాంచ నున్న. 13

ఆ. వె. ఎంతొ ప్రేమతోడ నీ ప్రదేశంబుల
మలయు చుండువాఁడ వలదినముల
నిప్పు డొక్కమాఱు నే ఋతువున నైన
బుద్ధి వీనిఁ జూడఁ బుట్టకున్నె. 14

తే.గీ. మొక్కమావితోటను గాచు ముసలితాత
జోకమగు పండ్లమేలేర్చి తోక బుట్ట
వేసి బడ్డిని ప్రేలాడఁదీసెనదిగో!
మనల కొఱకవి వానిని దినఁగ రావా. 15

తే.గీ. దమ్ము చేసిన యట్టి కేదారములను
నాకు నూడ్చెడు వారలు హర్ష మెచ్చఁ
గంఠములఁ గల్పి యెక్కడి గానములను
వింతఁ బాడెద రంచును వినఁగరావా. 16

తే.గీ. ఉదయ మెల్లను గుప్పను నూర్చి యంత
తెచ్చినట్టి చలిదిముంత తృప్తితోడఁ
గుడుచు పాలికాపుల యుల నడవడికలు
చోద్యము లటంచు నెంచుచుఁ జూడ రావా. 17

తే॥గీ. గ్రామ మధ్యంబునను నొప్పు రావి నీడ
లందు తీఱుబడిని గూడి హాళి కాళి
ముచ్చటాడుకొనుచునుందు రెచ్చటికను
ననుచు వారితో భాషింప నటకు రావొ. 18

ఉ. ఎక్కడి రాక లింక నెపుడేనియు మృత్యువు వాతఁబడ్డ వాఁ
డొక్కఁడు వెండికానఁబడుచుండుట వింటిమె? లేదు వెఱ్ఱినై
మక్కువ మీఱ నట్టు పలుమాఱులు పల్కుదు రావ రావ
[టం
చక్కట! యేటి మాట లిక నాప్తవరేణ్య! మమున్ దయ
[జించితే. 19

తే.గీ. ఈ స్థలంబున నీయాల నీజనముల
విడిచి యుండగఁ నేర నియ్యెడల నున్న
నిన్ను స్మరియింప కుండని నిమిషమున్నె
యెట్లు విడనాడు వాఁడనీ యెసఁగు చింత. 20

తే.గీ. చనిన వారల గుణములు మనమునందు
బొడము నేనియు వానిని బోలునట్టి
వస్తువుల జూచుచుండిన వగపుతగ్గు
నంచు నెంతయు నేనిప్పుడెంచు చుంటి. 21

తే. వేణునాదంబులను నల వెదురు పొదల,
బలుకులను వల్ల సెలయేటి జలజలముల

నుంచి యేగితి వని వాని నెంచుకొనుచు
నించె దిరుగాడు చుందు నానందముగను. 22

15 రాజ్యపదచ్యుతుఁడు

o:x:o

తే. బారుమను నొక్క పెద్ద యావరణమందు
శిథిలమై పోయి చెల్లి వృథగఁ బెరుఁగు
కోటగోడల నడుమను గొనకు మిగిలి
యున్న చావడిలోపలఁ దన్ను మఱచి. 23

తే. చిన్న పట్టెమంచంబుపైఁ జిరుగుఁపఱిక
బండుకొనుచొంటి నలపూసపాటి కొమరుఁ
డాత్మయందలి యూహ దేహంబు మించి
జేష్టలను సల్పు స్వప్నసుగోష్ఠిఁ దగిలి. 24

ఉ. ఆతని కంటిముందు కననౌను నొగిఁ దనపూర్వులెల్లరుఁ
జేత స్వతంత్రముంచుకొని శ్రీయుతులై, యొక పెద్ద రాజ్య [మున్
నీతిమెయిఁ భరించుటలు నిల్వను మీఱిన కోటగోడపై
నాతతసైన్యముల్ నిలిచి యన్యులకుఁ జొఱగామి సేయు [టల్ 3.

మ. మఱియున్ గాంచెడువాఁడు గా, సకల సంపద్గౌరవార్హాం
[బయా
పురముల్, దీర్చినయట్టి కొలువునున్, బొల్పొందు నంతః
[పురీ
పరివారంబును రాణివాసమున శ్రేవర్ణబుచ్చు కాంతామణీ
సరసంబున్, మృగయా వినోద పదసంచారాటవీప్రాంత
[మున్. 4

తే. కాని నిక్కువముగ, దనకాల వైప
రీత్యమును జేసి తలయింత యెత్తఁబోఁడు
పలుకరింపఁగ నొక్క సేవకుఁడు గాఁడు
బ్రదుకు నుపకార వేతన మొదిగికొనుచు. 5

సీ. అతని ముందునఁ గేళికాలయోపవనంబు
మోడువారుటఁ గాంచ మోదమెట్లు?
అతని ముందున వేటలాడు తావులు రైతు
సొంత భూములుకాఁగ సుఖమదెట్లు?
అతని ముందున సర్వస్వాతంత్ర్యములు కొని
నామ మాత్రుని సేయ నవ్వదెట్లు?
అతని ముందున తన యఖిల భాగ్యంబులు
నరి కొల్లకొని పోవ జరగు టెట్లు?

గీ. శోచనీయుండు సుమ్మి యా రాచబిడ్డ
మూల కొడికట్టు నొక్క యాముదపుసెమ్మె
దీపమును బెట్టుకొనుచు నిద్రించువాఁడు
పైని బూజుసరంబి ప్రాఁబనులు తనుక. 8

తే. ముంగిలిని బుంజులను గట్టు మొద్దుతాళ్ళు
పుంజు లేమియు లేకయె పొడముచుండు:
ఒక్కటియొ రెండొ గొరువంక లక్కజముగ
పంజరంబునఁ బలుకు సెప్పకయె పెరుఁగు. 9

తే. అయిన నొక్క సుదినము కద్దతనికంచు,
దెలుపఁగా నెంతయును నేను గులుకువాఁడ:
దాపునను ప్రసిద్ధమగు క్షేత్రంబు కలదు
దాన నేటేటఁ దీర్థ ప్రథమ దినంబు
రథము బయలుదేఱెడు ముందు రాజు తనదు
చేయి ముందుగ వేయుచుఁ దీయఁడేనిఁ
గదల దించుకయైనఁ జక్రంబటంచు
నధిక గౌరవమున వానినందు నిలిపి
ప్రజలు మిక్కిలి కొనియాడువార లింక.

16 వర్షానంతరము

:o:

తే. పెద్దవర్షంబు కురిసిన వెనుక నొక్క-
సంధ్య వేళను స్వైరసంచారి నగుచుఁ
గాలి(వేళ్ళఁ (గుచ్చుచుఁ జేలగట్ల పైని
నడచుచుంటిని ఘనయోజనము లెసంగ. 1

తే. ఆకు మళ్ళెల్ల నిర్మలమైన వానఁ
దడిసి యొకవింత చెలువంబుఁ దాల్చియుండె.
అందునందుఁ జిందెడు నీటి బిందువులను
జివరనాపంచి కుచ్చెలు చెమ్మగిలెడు. 2

తే. ఱెక్కలల్లార్చు కొనుచును నొక్కటొకటి
పక్షులెల్లను గూయుచు బయలుపడెడు.
అల్లనల్లన గట్ల పగుళ్ళనుండి
బిలబిలమటంచు ధారలు వెలికిఁదొఱఁగె. 3

తే. ఆకసంబెల్ల నెప్పటి యట్ల తనదు
సహజనీలంపుఛాయల జరపుచుండె
నపరదిశయందుఁ జెలగె సాంధ్యా(భమాల
(ప్రళయమందైన నారని (ప్రభయనంగ. 4

తే. అడుగులడుగున నలుగుచు నడగిఁయుండు
గడ్డిపూవులకును గగ్గె దొడ్డరంగు.

ఏమియును వినఁబడవె యయ్యెడల నొక్క-
వాన కురిసి వెలిసిన శబ్దములుతక్క-. 5

ఆ. వె. అట్లు కొంతవడికి నరిగిన యంతనే
వినగఁవచ్చెఁ బిలుపు వెనుకనిట్లు
"పెద్దబాబుగారె! వేంచేసినారు గా
వారిపొలములన్ని వరుసఁగనఁగ." 6

చ. అదివిని యట్టెమళ్ళ మొలనందఁగ నేపును జూపు [చేనులో
ముదుసలి యొక్క-రుండు తనమూపున గడ్డిని మోసికొం [చు నా
కెదురుగవచ్చిదించుకొని 'యుస్సని'గట్టునఁగూరుచుండె; నే
మదిఁగడు జాలినొంది యలమానిసితో నిటుపల్క-సాగితిన్

తే. "ఓయి! రామన్న! యిదియేమియోయి! పడుచు
నుంటి వింతలో శ్రమలను నుస్సురనుచు"
"బాబు! కాదమీకిప్పుడు పడుచుఁదనము
నేను మూల్గెడు ముదుసలి నైనవాఁడ. 8

తే. వయసు నందున నాగలిఁ బట్టిదున్న
బెల్లుబెల్లుల వడినేల పెల్లగిల్లె.
పాఱచేతను బూనుచు నీరుకట్ట
నెవ్వఁడైనను నాకప్పుడీడు కలఁడె?

తే. ఒక్కనాఁ డలకాలువ ప్రక్క మనకుఁ
గాపవరపు వారికిని జగడము పొసఁగ
జబ్బనాపితి నావేళ దెబ్బనొండు
తప్పిపోయినఁ దలపైనిఁ దగిలియుండు.

ఆ॥ వె. మీరలేమి యెఱుఁగు వారలు నాసత్తు
వల్ల తాతగారి కయ్య కెఱుక
యింతనాటినుండి యిప్పటి వఱకును
కాచి యుంటిమనల "కంత్తు" మందె.

ఆ॥ వె. దాని కేమిగాని తండ్రి! మీరేమేమొ
యెంతొ పెద్దచదువు లెఱిగి తండ్రు
పాడగలరె పెద్ద భారత గాధను
జెప్పగలరె యర్థ మిప్పుడడుఁగ?

కం. మీ కక్కయ్యల పోలిక
నాకథలను వినికి సేయనగునే మీకున్?
హా! కంఠంబను చోనల
మీకడ తాతలది, యెంత మెప్పొవడసెన్.

తే. అయిన మీకివి యన్నియు నవసరములు
కావు కాఁబోలు, రాముఁడు రావణుండు
భీముఁడర్జునుఁడును కృష్ణ నామములును
వారికథ లేమియును మీకుఁ బనికిరావు.

సీ. హరి హరీ నారాయణా యటంచును
పాడి యేతాము త్రొక్కితి నేనుమున్ను
గొల్లసుద్దుల నాడి తెల్ల వెన్నెలయందు
చేనుకా పుంటిని నేను మున్ను
హాలిహాలియని గట్టిహాలికేక వేయుచు
నిందుఁ బండించితి నేను మున్ను
మన పురాణపు లీలలను గుజ్జులకుఁ జెప్పి
యెంతో నవ్వించితి నేను మున్ను.
గీ. ఇప్పుడేమున్న దంతయు జప్పఁబడియె
కంఠ మందలి కంగును గానఁబడదు
ఎన్నిమాఱులో యయ్యలయెదుటగూడఁ
జాటు వాఁడను పెదపెద్ద సామెతలను.
తే. బాబు రండింక చీకటి పడుచునుండె
పురుగు పుట్రుండు నడచెద ముందు నేను"
అనుచు నాతఁడు మోపెత్తి కొనుచు సాగ
"నెంత వాఁడవు రామన్న! యీ" వటంచుఁ
బలుకుచును వెంటఁ బోయితిఁ బ్రమదముననను.

——

17 సారంగధర

——:(o):——

ఉత్సాహము

"మిత్రమా! విహారమునకు మిత్రులం గొనిపోవుచోఁ
జిత్రములగుఁగథల నడుమఁ జెప్పి తనుపుచుందురే"
"మిత్రమ! మనసార నట్టిమేలుకోర్కె పుట్టుచోఁ
జిత్రమైన యల్లమెట్టఁజేరి, చెప్పుకొనఁదగున్. 1

సీ. పంచాస్యశార్దూల భల్లూకవాసమ
హాటవీవిటపిసమావృతంబు
సన్నుతసత్కీర్తి సంయుతనన్నయ
ప్రగ్గడ కవివర్యభాషితంబు
ధనధాన్యరత్న నిధానసంసూచనా
ప్రాసాదరాజ విభాసితంబు
కోటిలింగక్షేత్ర గోపురశోభిత
పూతగోదావరీ భూషితంబు

తే. ధరనునలరు రాజమహేంద్రిపురవరంబు
అందు బ్రాహ్మణపాండిత్య మగ్గలంబు
రాజభుజబల మెవ్వేళఁ బ్రకటితంబు
వైశ్యభాగ్యంబు సత్కార్యభాజనంబు" 2

చ. ‘‘అదె! యలతాళపాదపశిఖాంతరమందునధూమధూళులన్
జదలనునింప నంపుచుఁ బ్రశస్తరుచిన్ దనరారుచుండె న
య్యదెకద తత్పురంబహహా!” “ఔనవు! దానినెయేలు
[చుండె స
మ్మదముసఁ బూర్వమొక్కపుడు భూపతి రాజనరేంద్ర
[రాజనన్. 3.

తే. ఆమహారాజునకును రత్నాంగియందుఁ
బ్రభవమొందెను సుతుఁడు సారంగధరుఁడు;
దినదినమతండు వృద్ధిని దనరఁదొడఁగెఁ
గరముసితపక్ష సారంగధరునికరణి.” 4

చ. “అగునగుఁ గోటగుమ్మమని యాసతిమేడనికందకంబటం
చొగిఁబలుకంగవిందుము జనోక్తులనెన్నియొ” “నిక్కవం
[బు కా
నగనగువానినిన్బురవనంబునకున్ మునుముందు,నిప్పుడా
సొగసగుకట్టడంబులును స్రుక్కివినాశనమొందియుండెడున్

ఆ. మొగ్గ విడిచి యల్లపూవగు పోలిక
నతని శైశవంబు యౌవనమును
బొందె నంత మోదమొందుచు భూపతి
తనయునకును బెండ్లిఁ దలఁచె నెడఁద.

చ. తలఁచినయట్టి యప్పుడొక తన్విపటంబరుదెంచెఁగాని యా
చెలిచెలువంబుఁ జూచి తనచిత్తము భ్రాంతి పడంగఁ
[బుత్రునిన్"
"దలపక తానె కట్టుకొనెఁ" "దత్తరుణీమణి జవ్వనంబునన్
జెలఁగుచు నుండఁబోలుఁ దమి సేవలఁ జేసెనె వృద్ధభర్త
[కున్ ?"

మ. "వరవంశంబునజన్మమందుటను భావంబందునర్జింకుచున్
నరనాథున్దనియించుచుండె, నయినన్ నారీమణీమానసం
బరయన్ జక్కని రాకుమారుపయి మోహంబంది యుం
[డెంజుమా
తరి యే నాఁడని చూచుచున్ సతతమత్యంతంబుఁ జింతిం
[చుచున్.

కం. ఇప్పగిదిఁ గొంతకాలం
బొప్పుగఁ గడవంగఁ గల్గె నూరికిఁ జుట్టున్
ముప్పులు వన్యమృగంబులఁ
దప్పక వేటాడవలసె ధరణీపతియున్.

కం. అప్పుడు వేటకు వెడలెను
నొప్పుల చిత్రాంగి యొసఁగె నుత్తరము పతిన్
దప్పక వడి రండనుచును
జెప్పఁగలేదు సతిపేరు చిత్రాంగి సఖా !

ఉ. ఈ దినమందు రాసుతుని నేఁగననౌనని కుల్కుచుఁ మనో
వేదనఁ బొందసాగెనలబిత్తరి, యాయప రాహ్ణమందునన్
మోదముతో నతండొక కపోతమునుంగొని యాటలాడు
[చుఁ
వే దివిముట్టఁ బోవిడిచె విస్మయమెచ్చఁగ జూచువారికిఁ.

కం. సొగసుగ నాపారావత
మెగురుచుఁ జిత్రాంగి మేడ నే వ్రాలెను నా
వగలాడి పట్టుకొనియెను
సగమహా! చేకూరెననెడు సంభ్రమ మెసఁగన్."

కం. "ఇది యొకనిదర్శనంబగు
మదనుఁడు తన యాశ్రితులకు మఱవక యాయా
యదనుల నొప్పుగఁ గూర్చెడుఁ
గద! నడుమఁబలికితి ననక కథ నీకఁ జెపుమా!"

కం. "పావుర మచ్చోట వ్రాలెను
దేవల దాయనుచుఁ దలచి తిన్నగ నేత
ద్భూవరవరనందనుఁ డల
భూవరసతిమేడ పయికిఁ బోయె రయమునన్."

కం. "ఆవనిత మేడయనుచో
నావంతెన ప్రక్కఁ గొఱలు నలసౌధమొకా"

"కావచ్చును నేమననా
తావల సౌధంబునకును దగు ననవచ్చున్.

కం. ఆసరికెరవియుఁ గ్రుంకెడు
నాసలు జారులకును హృదయంబులఁ బొడమన్
"ఆ సంధ్యారాగో దయ
మీ సాయంతన మల్లె యొనరెనేమో కనఁగన్."

చ. "తనకుఁ గుమారుఁ డెట్లగునుదత్యము మారుడటంచు నెం[చుచున్
వనితయు సాదరంబుగను వానినెదుర్కొని పక్షియన్న ని
త్తును పరులట్లు నీవటులఁ దొందఱఁ జెందెదవేల యంచు [దాఁ
గనుఁబఱుపంగఁ జొచ్చెఁ దన కాపురమున్ బడకింటి తా[వులన్.

కం. ఎంతకు సారంగధరుని
స్వాంతము మఱియొక సరణిని నగపడకునికిన్
సాంతంబుగఁ దన పెండ్లియు
దంతంబునుఁ దెల్పె నపుడు తమి యుప్పతిలన్.

చ. తుదకిఁక నెమ్మదిన్ బొడము దుష్టతలంపు నడంపలేక త
త్సదమలవర్తనుండయినత్మాపతినందనుతోడఁ బల్కెనా

హృదయమునీదురూపమున నెంతొ విరాళినిజెంది వేగెదుర్
సదయత నాదుజన్మమును సార్థకమందనొసర్పఁగానగున్.*

తే. "వావివరుసలు తలపఁగరావుసూవె!
మంచి చెడుగని యించుక నెంచరుకద!
కాముకులు వారిమనములఁ గాముకుండ
ఖండముగఁ దాండవంబాడుచుండునెడల, 20

చ. "తరుణి వచించువాక్యములు తావిని రాజకుమారశ్రేష్ఠుఁడా
కరములరెంటిఁ గర్ణములఁ గప్పుచునిట్టులఁబల్కె సాగెదున్
"హరహర! నీవిటుల్ నుడువనర్హమె? తల్లివినీవునాకు నే
నరయఁగనీకుఁబుత్రుఁడనున్యాయమె? లోకులువిన్నఁదిట్టరే?,

కం. పలికెడువానిన్ వినకయె
బలిమినియత్నంబొనర్చెఁ బడయఁగ సతియున్.
జలియింపక యతఁడెట్లో
వెలుపలఁబడి గృహమునకును వెడలెనుచింతన్* 22

చ. "అది పెఱవారికిన్ దెలుప నాయవనీపతినందనుండు తా
నెదఁ దలపంగలేదుకద యెంతటిధీరుఁడొ శాంతచిత్తుఁడో*
"యదితనుచాటునేనిఁ దనయయ్యనునమ్మను నన్వయంబు
[నుఁ
బోదలెడుదుర్యశంబనుచుఁ బూజ్యుడతండు గ్రహింపకుండునే?

ఉ. అంతటనామృగాక్షి తనయానలు వ్యర్థములౌట నీసునన్
జింతనసేసి పీనితురుశిక్షవిధింపఁగ నౌనటంచు నే
గంతనొయొక్కమూలఁగడుఁగాసిలినట్టులఁబండె నంతలోఁ
గాంతనుఁజూడరాజు తమకంబునవచ్చెను వేటపాటునన్

కం. వచ్చినఁ దనుఁగనకయె య
మ్మచ్చునఁ జెలియుంటఁజూచి మదినాశ్చర్యం
బెచ్చుగ నుదయింపంగను
జెచ్చెఱఁ జేరి యడిగె క్షితిపతి మమతన్. 25

సీ. మరునికటారివై మరులిగురొత్తించు
వనితరో! నీవిట్లు వనరనేల?
చంద్రికాహాసవై సంతోషమును జిల్కు
చానరో! నీవునన్ గానవేల?
మానినీ తిలకవై మహినొప్పు మానిని!
యవమానవతివగు చడలనేల?
శృంగారవతివయి రంగారు చిత్రాంగి!
శిలుగొంది నీవు చింతిలఁగనేల?,

తే. అనిన యొకియింత బెట్టుగ నల్ల లేచి
యధిప! నీయానఁ జెపుదు దుర్విధిని వినినఁ
జెప్పఁగా నేమిఫలమని, చెప్పలేక
చెప్పినట్లుగఁ జెప్పె దుశ్శీల యిట్లు. 26

తే. ‘నాకుమారుఁడై నన్నుఁ జీకాకుపఱచెఁ
గట్ట! సారంగధరుఁడు నాచెట్టపట్టె
మత్త యువరాజు నన్నవమాన పఱచె
బలిమి ముద్దులపట్టె నన్బరిభవించె’

చ. అదివిని రాజు డెందమున నచ్చెరు వాత్రము రోషమున్ [బయిం
బొదువఁగనట్టె కొయ్యయయిపోవుచు మిన్నకనిల్చెనంతట
మ్మదవతియేడ్వసాగె ‘నవమానమునుంభరియించుటెట్టులీ
సుదతులు జిత్తులన్నియును సూక్ష్మముగాఁ గడుఁబన్ను [వారు జూ.’’

ఉ. “ఓనరనాథ! నాథ! వినుమోనగరేశ్వర!యిట్లుచూడుమా
మానధనాగ్రగణ్యా! యలమాటలు నోటనఁగాక యుండెనా
మానసమెల్ల యిప్పుడవమాన దవాగ్నివిదగ్ధ యయ్యె డో
హో! నయశాస్త్రవేత్త! తనయుండొనరించెను మాన [హానినర్

తే. అను చినుమడించి పలికెను నన్యపాప
మించుకెఱుఁగని యావృద్ధనృపతి వణఁక
నృపతియు మఱేమిసేయంగ నేర్చువాఁడు
తల్లిమానంబుఁ జెఱచిన తనయుఁగూర్చి. 30

శా. ఏమేమీమృగయార్థమైయటవి కేనేగంగఁదాఁగాంచిదు
ష్కార్మోన్మత్తతఁజేసెనే యిటుల ఛీ! ఖండించెదన్ వా
[నినం'
చేమాత్రంబువిచారమున్ సలుపకే హింసించె సత్పుత్రు
[నిన్
సోమాస్యన్ వరనీతివర్తనుని నస్తోకప్రభాధాముని.

కం. ఈతావునందె సుమ్మా
భూతలనాయకసుతుండు పొందెనుశిక్షన్.
చూతమటంటివయేని
జాతిన్ దక్షుండనమిటఁబ్రికటితమయెడిన్. 32

కం. కానీ సత్యముడాగునె?
మానిని యొనరించినట్టి మర్మంబెల్లన్
భూనాధునకును దెలిసెను
నానాతియుఁబొందె నంత్యమతిఘోరముగన్. 33

తే. ఉప్పుపాతఱ నడఁగెను నప్పడంతి
యిప్పటికిఁగూడ నయ్యదియెఱుఁగఁబఱతు
రల్లపాతేరు గ్రామమునందు జనులు
జాయినొకదానిఁజూపి చిత్రాంగి యనుచు,, 34

ఉత్సాహము

"ఇఁక నుమనము గృహమునకును నేగుదమి దేలెమ్మ వే,
సుకరముగను జెప్పితీవు చూచినట్లె యీకథన్"
"సుకరముగను జెప్పి తీవుచూచినట్లటంచు న
న్నొకసకియము లాడుచుంటి వేమొ మిత్రరత్నమా! 35

ఉ. కూలెడుమంటిగోడదిగఁ గ్రుంగెడుకప్పునఁదాటియాకులన్,
గాలికిఁబుచ్చి పాఁతగిలికన్పడుచున్న కుటీరమద్ది ది
వ్యాలయమై తమంతగు కుజావళిమామిడి జీడిమామిడిన్
మేలగు చీనచున్నతపుమెట్టను నీకథఁదెచ్చె జ్ఞప్తికిన్." 36

18 తీవ

ఉ. ముద్దులచిన్నితీవ! నిను ముచ్చట నెచ్చటొ కాంచి, [తెచ్చి నా
యొద్ద నమర్చిపెంచి కర మొప్పుగఁ బందిరినల్లి, వేడ్క నే
ప్రొద్దును బ్రాకుదాననని పూచెడుదానవటంచుఁగుల్కఁగా
నెద్దియొ పెల్లగించినిను నీక్షణ మందున రూపుమాపెఁగా

సీ. లేయెండ నీపైనిఁ గాయనోర్చితికాని
ముదురెండకాయ మారోర్మము వెడితె!
చల్లని చినుకుల చవులఁ దేలితికాని
జడివాన కొట్టఁ జంచలతఁగంటె!
పిల్లవాయువులలో నుల్లసిల్లితికాని
విసరి వీచినవెంతొ బెదరునుంటె!
కొనవ్రేళ్ల నవరించఁ బెనఁగుచొప్పితికాని
మోటుతాకిన దిగుల్ పాటు వడితె!
నవకములపోవ! లేఁదీవ! యవయకుండ
దినదినాభివృద్ధినిఁగని త్రుటినినాకుఁ
దెలుపకుండఁగ నేఁడఁబాసితే యొకింత
సొగసు చెలువమ్ము జాడయు మిగులనీక!

ఉ. నీమృదులంపుఁ గ్రొంజివురు, నీరమణీయపుఁ జాయ, యల్లనీ
కోమలరాగపుంగలుపు కోలుతనంబౌక కొన్నినాళ్లయున్
నామనమందు నాటుకొని నన్ను విడంగను జాలకున్నవో!
కామితవల్లరీమణిరో! కంటికిఁ గట్టినయట్టులుండు వే. 3

---

19 జన్మస్థాన సంస్మృతి

చంపకమాల

స్మరణకువచ్చుచుండె మన చక్కనిగ్రామము కొండలన్ [గనన్,
నరహరి కీర్తికాంతులను నల్గడలన్ ధవళాగ్ర మెంతయున్
బరువుచునుండెఁ, బాండవుల పర్వతపంక్తిని జూడు దాని ద
గ్గరవిలసిల్లు నాచెఱువుగట్టున హాయిగఁ జల్లగాలికిన్
దిరుగుచునుండ మే, మఱియుఁ దీయని మామిడితోఁటకా [వలన్
గరువునకేగి యల్లమునగాలగిరుల్ వడినెక్కుచుండ మే,
యరయమె యింక నుత్తరమునందున నొప్పెడు కొండ [లల్లవే
వరుసగ నీలమేఘము నభంబునకంటెడు పోల్కి లేచెడున్;

గరముసమీపమందుననె కన్పడుచున్నవి నిబ్బరంబుగా
సరగుననేగుచో మనముసంజకుపూర్వమె చేరమాయనన్.

---

20 ప్రత్యక్షము

---o:x:o---

ఆ. "అనుదినంబు నీదునందను మలయుచు
నుండువాఁడ నాకు నుదధి! యొక్క
పరిభవత్స్వరూప ప్రత్యక్ష మొనఁగూర్చు
తొల్లిరామునకును దోఁచినట్లు." 1

తే. అనుచునే నొకలలిత దినాంతమందు
జలధితీరవిహారముఁ సలుపుచుండి,
వెలయువారిధిఁ గూరిచి విన్నవింప
దానివిని వార్ధియిట్టు లుత్తర మొసంగె. 2

తే. "అల్ల రాముఁడు క్రుద్ధుఁడై యమ్ముఁబన్ని
విడుతునంచును నామదిబెగడుఁ గొలిపె
నీవు చేసెడిదేమొ నా కెఱుఁగ పఱతు
వేనిఁ జూపించువాఁడ నామెసఁగు రూపు." 3

తే. దాని విని నే వచించితి "నేను నిన్ను
నిష్ఠురములాడి నొప్పింప నేర్తు, నీదు

రూప మిప్పుడు నాకిటఁ జూపకున్న
నెఱుఁగవా? నేను చిన్నప్డె యెఱుఁగువాఁడ."

కం. "తనువున విఱిగిన యమ్ములు
ననువునఁ బుచ్చంగ వచ్చు నతి నిష్ఠురతన్
మనమున నాటిన మాటలు
వినుమెన్ని యుపాయములకు వెడలునె" యనుచున్

సీ. ఈశ్వరుండు కుడువ నిడిలివి బడబాగ్ని
నాపని ఘోరమౌ పాపమందుఁ
జందురుఁ డేరీతి జరిగింప జరగుదు
నీకుమారున కీవు లోకువందు
నంబరచాయల బింబించు చుందువు
నీ వర్ణములు నీవి కావటందు
భూమిని సతతంబు మోదుకొందువు నీదు
వర్తనం బంతయు భంగమందు

గీ. జడధి! నీ జలం బుప్పుకమం బటందు
నీవు చేపకు మొసలికి నిలయు వందు
నెనఁగు నీప్రక్క నుత్త గండ్రిసు కటందు
ననుచు బెదరించితిని దాని కడలి యేమొ. 8

సీ. బెళుకు చేపలఁ బోని తళుకు లీనుచు నున్న
చూపుల నివ్వాళిఁ జూపువారు

తాబేటిచిప్పలు నాఁ బోలు చుండెడు
మోకాళ్లపైఁ బడి మ్రొక్కువారు
శైవాలమునకును సరివచ్చు కురుల నొ
ప్పారు శిరమ్ముల వంచువారు
అనిలంపు మ్రోతల కెనవచ్చు చుండెడు
స్వరముల భజనంబు సలుపువారు.

తే. అంబరస్పర్శచేఁ గల్గెననఁగనొప్పు
నడుముతోడ విధేయతల్ నడుపువార
లెంత తెందలో చుట్టు నమందగతుల
నేగుదెంచుచు సేవల నిడుచు నుండ.

సీ. హైమనైర్మల్యంబు లమలంపుమోమునఁ
బోలుపాఱఁ బొంగుప్రపూతగంగ
పెద్దవజ్రిపుఁగాంతి నిద్దంపుఁజెక్కిళ్ల
మెఱయనచ్చెడు గౌతమీఝరంబు
ఘనవేణిమురిపెంబులనువైనకటిపైని
నసియాడ నరుదెంచు నల్లకృష్ణ
చురుకైన నడకలు వరపదమ్ములమ్రోయఁ
బింపిల్లు గూయుకావేరియేరు

తే. చిత్రగతులను జూపుచుఁ జెలు వెలర్ప
నేగుదెంచు తక్కుఁగల నదీగణమ్ము

రంగ దంచితశృంగారరసము లొలుక
సరసఁ దగఁజేరి తగుపరిచర్య సలుప.

సీ. కనులబండువ సేయుఘనదేహరుచితోడ
గంభీరమగు శంఖగళముతోడ
చెలఁగుగాలి కెగురుచేలపింజెముతోడ
రహినాడు రత్నహారంబుతోడ
జగతి కదృష్టమై నెగడుడెందముతోడ
నురుభారమూను పేరురముతోడ
రవణించుడిండీర ధవళహాసముతోడ
విలసిల్లు పవడంపుఁ బెదవితోడ

తే. కనకపూర్వపూరుష రూపమును ధరించి
స్వీయహస్తముల్ ముత్తెపుచిప్పలట్లు
మోడ్చి నమ్రభావమ్ములు పొడల నాడు
మోలిఁ బ్రత్యక్ష మయ్యె సముద్ర మహహా!

తే. వాని కనునంత నాకొక్క వరుస మదిని
విస్మయము భక్తి సంతృప్తి వేడ్క లమరఁ
బలుకసాగితి నీలాగుఁ బలుకఁదగవొ
మనలముందు వినమ్రులై ఘనులు నిలువ?

సీ. ధవళచంద్రుని వేల్పుకవణంబు గాఁజేసి
యీవునురగలతోడఁ దృప్తికంటి
తీయని యమృతంబు దివిజులకర్పించి
యీవుప్పుతోడను నెసఁగుచుంటి

ఐరావతోచ్చైశ్శ్రవాదు లింద్రున కిచ్చి
యీవు చేపలతోడ నింపుగంటి
కౌస్తుభలక్ష్ములఁ గమలాక్షునకు నంపి
నీవు నత్తలతోడ నెగడుచుంటి
తే. విపుడు నీఘనత్వంబు నా కిచ్చి యిట్లు
నీవు నమ్రతతో ముందు నిల్చియుంటి
వార ! నిను గొనియాడంగ నగునె నాకు
ననుచు గనులు మొగిడ్చి సాష్టాంగపడితి

క. పడి లేచి చూడ వప్పరు
షుఁడు మాయం బయె; నెదఁ జోద్యము మిగులన్
బొడమఁగ నచ్చోటను బడఁ
పడి కనుఁగొనఁగలిగినాఁడ వార్థివ్యాప్తిన్ 12

చ. లలితవినీలకాంతులు తలంబున
బింబిత మౌచునుండఁగా
జలములు గాలికిన్ జెదరి చల్లనిబిందువు లై
స్పృశింపఁగా
నల లొగిఁ జుట్టి వచ్చుచు రయమ్మునఁ దీరముఁ
దాకి మ్రోయఁగా
నలఘుసముద్ర మయ్యె మఱి నాతఁ డహా ! యని
లోన నెంచితిన్. 13

21 చిన్నిలోకమా!

ఉత్సాహము

అచ్చెరువుగ నాకసమున నర్బుదాలు నిర్బుదాల్
రెచ్చుచుండి యుడుగణమ్ము రేయి నెల్ల శాంతమున్
బుచ్చుచున్నఁ గాని, వేఁగు పొడమఁ జిన్నిలోకమా!
తెచ్చుకొనెద వేల చింత తెగనికలహమోదివై ?
అంతరములు కొలుపుచున్న నాత్మ ధర్మ మెంచుచున్
బంతగింప కుడుగణమ్ము పైసి రాతి రంతయున్
గాంతిలినను గాని వేఁగు కాఁగఁ జిన్నిలోకమా!
యెంతొ యీర్ష్యఁ జివికె దేల తృప్తిరహితభావివై ?
పొడుపుఁ గ్రుంకుపాటు లున్నఁ బొడిచి గ్రుంకువఱకునున్
గడుసహించి నిజరహస్య గాన తన్మయమ్మునం
దుడుగణమ్ము మాపునెల్ల నొక్కతీరు మింటిపై
బుడుఁగు మన్న కాని వేఁగు మీఱఁ జిన్నిలోకమా!
పడెద వేల దిగులు నీవు ప్రతిక్రుటిన్నిరాశవై

శ్రీ క్షేమక గ్రంథాలయము
వేలప్రోలు.

22 అంబుదంబ!

—:x:—

గీతమాలిక

అనుజులను గూడి యొక యపరాహ్ణమందుఁ
గాపవరపుఁ దటాకపు మేపులందు
వాజులన్ బట్టుకొనుచు సవారిఁదీయు
చుండఁ గాంచితి నిన్ను దిఙ్మండలమునఁ ; 1

బొరలి వచ్చెడు వారిధి పోననంగ
నొక్క నిమిషమ్ములోన మే మక్కజపడ
గాలితో వ్యాప్తవైతి వాకాసమంత,
యెంతొ వర్షింతు వనఁబోతి వంతలోనె. 2

అనఁగు వెనువెంట నొంటు సాయంతనమున
జివర మునగాలకొండపై చింతకొమ్మ
నెక్కి కాయల నూపుచు నెక్కసక్కి
యములఁ బ్రొద్దును బుచ్చెడు నవసరమున ; 3

నలసిపోయిన సాంధ్యార్కు నందుకొనెడు
నపర దిక్సతి చెలువంపు హస్తయుగళి
మెఱయు చుండెడు హురుముంజి మెత్తలనఁగఁ

బఱగు నిన్గంటిఁ గన్నులబండువుగను. 3
నిదుర లేచుచు నే నొక్క యుదయమందు
నూతనోత్ఫుల్ల పద్మవినోదమైన
కొలఁకునను దోనెఁ ద్రోయుచుఁ గుసుమములను
బొదువు చెడకుండఁ గొనగోటఁ బుణుకుచుండఁ ; 4
ప్రాగ్దిశాచలదేవళద్వారమునకు
నడ్డముగ వేయు తామ్రంపుకడ్డీ యనఁగ
వెలయుచుండెడు నినుఁ జూచి తెలిపినాఁడ
గట్టుపై నున్నవారల నట్టె పిలచి. 6
జోకమగు తోఁటనొప్పెడు పాఁకలోన
నంటుమామిడిపండ్లను నాహరించి
యపుడెయేతాము త్రొక్కన నలసియున్న
పాలికాఁపులతో వింత పలుకుచుండ ; 7
నురుములను మెఱుపులను మహోగ్రవృత్తి
నిలిచి పిడుఁగుల వడగండ్లఁ గలసి యొక్క
యేకధారగఁ గురిసితి వెంతొసేపు
ప్రళయమే ముంచుకొనుచును వచ్చెననఁగ. 8
జాముప్రొద్దుండగాఁ గళాశాల విడిచి
గౌతమీతీరమందునఁ గౌతుకమునఁ
బడవలను బండ్లఁ జూచుచు నడచుచుండ ;

వంతెనకుఁ బైనిఁ గనఁబడు పర్వతముల 9
మేఁత మేయంగ దిగు నాలపో తనంగ
వెల్లవన్నెలతో నీవు విశ్రమింపఁ
గాంచితిని నేను, మఱియును గాంచి వ్రాసె
మేలురంగుల పటము నా మేనమామ. 10
అల్లనీలంపుఁదలమున నందునందుఁ
బొడముచుండెడు ఫేనంబు బ్రోవుసేసి
దరికిఁ జేర్చుచునుండెడు కెరటములను
గనుచుఁ దిరుగాడు చుండఁగఁ గడలిపైనిఁ 11
గంటి ని న్నొక్కవేళ విఖ్యాతమైన
యింద్రధనువును దాలిచి యెసఁగుచుండ;
రూఢి నుత్తర దక్షిణధ్రువములందుఁ
గలుప రంగులవంపును నిలిపి తనఁగఁ. 12
జదువుకొనుచును నే నున్న గదికి ముందు
నల్లుకొను సన్నజాజులవల్లిఁ జూచి
నడుమ నడుమను సమ్మోదపడుచు నుండ
నొక్క వాసర మెల్ల నీ వొక్కతీరు 13
గట్టి యాకసమునఁ జిల్లుపుట్టె ననఁగ
ముసురు కల్గించితివి కడు విసుకు పుట్ట.
మఱియు నీ రేయి మేడపై మలయ పవన

లలితపోతమ్ములకు సంతసిలుచు మేము 14
ముచ్చటించుచు నుండంగ వచ్చి యహహా!
యెంచికుట్టిన సంచిని నుంచు రీతి
దాచుచుంటివి చంద్రుని తఱుము చుండి.
యెంతమేత్రైన నీ వాక్రమింతు వెట్టి 15
వన్నెల నయినఁ జూపింతు వెన్న నేల?
అంబుదంబ! ఆ రవిశశిబింబశోభి
తాంబరంబెల్ల రాజమార్గంబు నీకు!

---

23 ధ్రువబుద్ధి

ఉ. తల్లిరో! యట్టులుల్లమునఁ దల్లడమందుచు, లేగదూఁడపో
గొల్లఁడువెట్టియై నెమకు కూరిమిఁ జూపుచు వన్యభూ [ములం
దెల్లడఁగాళ్లతొట్రువడ నేటికిఁ ద్రిమ్మరుచుంటివమ్మ! నీ
పిల్లఁడు తప్పిపోయెనొకో! పెంచిన నీ హృదయంబు [నొవ్వఁగన్ 1

చ. అగునని చెప్పలేక యతివా! చెఱఁగ్రుశుల నొత్తి
[గొంతులో
బొగులుచుగద్గదంపడఁగఁ బోవుచునుంటివ నీదుత్రోవనా
కొగిమఱునల్కకుండగనెయొంటిగనెందులకేగెదమ్మ! పూ
ర్తిగనెఱఁగించువాఁడనొకతెన్ను సనాతనిఁజూచివచ్చితిన్.
చ. దిటమగునూడలన్ భువికి దింపి సుదీర్ఘపుశాఖరాజి ది
క్తటములఁజాపి దట్టముగఁ గప్పెడునాకుల చల్లగాలి నం
తట వెదజల్లి పక్షికలనాదమనోహరశ్రావ్యరాజిఁ బ్రా
కటమయియొప్పు ప్రాగ్వటఁపుగాఁటపునీడలచల్వపట్టులన్
ఉ. కావిదుకూలపుంగొనవికాసము పామకనాడఁ దంబుఱన్
దీవెలు వ్రేళ్ళమీటి యొకతీయని సుశ్రుతి మేళవించి స
ద్భావనలుప్పతిల్లగను పాడెడు మౌనివరేణ్యు సన్నిధిన్
భావనశీలు నీసుతుని బాలునిఁగంటిని వీనులొగ్గగన్. 4
మ. ఉపదేశంబునుభక్తిపూర్వకముగానుత్సాహియై బాల
[కుం
డు-పఠింపగనుజూనియుంటినతనిన్ లోలుండనై యేటి కీ
యపహాసాస్పదమావిరక్తికడుబాల్యంబందె చేకొందువం
చు, పరీక్షింపఁగనైతినీతనయుఁడా!చూడంగనౌనమ్మరో!
ఉ. అక్కడెయుంకనుందురొకో యక్కడనుండి మఱొండు
[చాయలన్

ద్రోక్కి చరిత్రో? చూడ్కులకుఁదోపరెయిచ్చోటుఁబాసి
[యుందు రే
ప్రక్కకుబోయిరో పరిసరంపుపథంబులనున్న వారితో
నిక్కమెఱింగి నేర్వదగు నిశ్చలచిత్తుని నీదుపుత్రకున్. 6

సీ. చిగురుటాకులగుజ్జు జిగికెంపుచెదరించు
కోయిలకూతలన్ గొసరుఁబంచి
మాగెడుఫలరాజిమధురంబుఁ జిలుకు కీ
రంబులపలుకు నర్థము ఘటించి
లలితంపుఁబొదరింటియలరుల వలపించు
గువ్వలకువకువల్ గూర్మిపెంచి
అల్లికగూటియుయ్యలతీవ నూగించు
పిచ్చుకముచ్చట లెచ్చరించి
గీ. సృష్టిసంతతస్వాదుసద్గోష్ఠిదగిలి
మౌనిశేఖరుఁ డతులనిర్మలత వెలయ
నిందె విహరించు డెంద మానందమొందఁ
గానరా డిప్పుడిప్పుడె కానఁబడియు.

శా. ఆయోగీంద్రుఁడు నేత్రపర్వముగ నిత్యంబిందు వీక్షించు
[చుం
డాయాచార్యులు క్రొత్తశిష్యునకునభ్యాసంబులొనంచున

త్యాయత్తాత్మకు నీదు పుత్రకుని గాంతారంబునన్ ద్రి[ప్పన
ట్లోయమ్మా! స్ఫురియించు నెమ్మదికి నాలోకింతమప్పట్టు[లన్.

మ. అటుపో! అల్లపాలంపు రేవడిని జోడైయొప్పు రెండెడ్ల నా
గటికిన్ గట్టికృషీవలుండొకఁడు చెక్కఁ దున్ని చేఁ జల్లిపం
డుటయెన్నండని రేల్ బవల్ పలుకఁదోడున్ లేక కాపుండున
చ్చోటకుఁ బోయి కనుంగొనన్ దొరకు నీసూనుండు[యోగీశుతోఁ. 9

ఆ. “ ండ్రితనకు నేను తనయుండనను ప్రేమ
ననుభవింపఁబోలము నప్పగించెఁ
బ్రొదుసంజ నాదుబొమముడి చెమటూర
కాలమానములను గణనఁజేసి

ఆ. దున్నిగింజజల్లి కన్నడసేయక
కాచుకొనుచు వానజూచుకొనుచు
పండుపంటఁ బొట్టనిండించుకొనుచుఁను
నిన్నియేండ్లనుండి యుంఁదెయుంటి.

ఆ. ఒడలిపాటవమున కోపికసమకూర్చి
పడెడువానవాలు వడుపునెఱిఁగి

శ్రీ వేమన గ్రంథాలయము

కృషిని జేసికొన్నఁ గీడేలకలుగునో
యనెడుసూత్రమును ధృఢాత్మఁదలతు." 12

చం. అనియెడు వాని పల్కులను నమ్మరొ! నీవు వినంగ [నేరవో
ఘనమగు నమ్మునీంద్రుఁ డలకాపును బ్రశ్నము వేసి [చెప్పుమం
చన బదులాడుచుండెను సుమా? త్వరబోదము వారి [జూడఁగన్
వినఁగను నాకునెమ్మదిని వేడుకపుట్టెడు వింత హెచ్చెడున్.

తే. అయ్యొ? యిప్పుడే హాళికు నరసి యల్లె
యుత్తరపు దిక్కుగా నేగియుండు రంచుఁ
జాటుచున్నవి చిన్నెలు బాట పొడవు
వారి నీనాఁడు చూడక వదల వలదు. 14

చ. కనుఁగొను మల్లవాఁగున నొకానొక తెప్పనుగట్టిపల్లె జ
వ్వని యొక తెప్పడుం దరికివచ్చుచుఁబోయెడువార లెల్లదా
టను గడఁబూనిపూనిక నడాడుచునుండును నాపెయొద్దకున్
ముని పలుమాఱుఁబోయి కడుముచ్చటలాడుటఁగంటిచూ [తమా. 16

ఉత్సాహము

"కొండకాల్వ! యెంత నీవు గొప్పదాట్లు వైచినన్

దండ నాదుగడను నిల్పి తగినతీరు నడుపుచోఁ
నుండకున్నె యిట్టు నటుల నూగు నేయటంచు ను
ద్దండవృత్తి నడుపు దాన దరికి దరికిఁ బడవలన్. 16

దాటఁగోర్కెకలిగి యొడ్డుదాపునకును వచ్చుచున్
బాటవమున జాలువాఱువాఁగునకును బెదర కీ
నాటివఱకు వచ్చినట్టి నరుల జంతుజాలమున్
దాటునట్లు చేసియుంటి దాన ముదమునొందుచున్. 17

తనకు లాభ ముండకున్న ధరను నన్యు లుపకృతిన్
మనలనుండి కోరుచున్న మానక యొనగూర్చ నౌ
ననెడుసూత్ర మెదఁదలంచి యంబుల మునుఁగంగ నా
జనుల నీఁది పైకిఁ దీసి సలుపుదుఁ బరిచర్యలన్, 18

గీ. అనెడు నల్లమానిని వాక్కు నాలకించు
మమ్మునీంద్రుఁడు నీసుతుఁ డది యెఱుంగఁ
దెలియఁ జెప్పంగఁ జేయు నాలలన చేత
రమ్మి యిచ్చుట కెంతో దూరమ్ము లేదు. 19

తే. అక్కటా! యాదరి నావ నదిగో! దాటి
సాగుచున్నార లప్పుడే ; యేగిచూత
మల్లపడవ యీప్రక్కకు మళ్ళిరాగ.
నెక్కిపోదము జననిరో! యక్కజమగు. 20

మ. కనుచూపున్ గొనరించి కానఁబడు నాఖండంబునం దొ [ప్పు ప
చ్చనిమేపున్ బశువుల్ దినాంతరమున కిచ్చన్ మేయుచుం [డంగ శ్ర
ద్ధను గాపాడుచు వేణునాదతతి సంధాన ప్రీతిధ్యానమున్
దనివిన్ జెందెడుగోపబాలకులచెంతన్ జూడఁగన్పించరే."

మత్తకోకిల

"గొఱ్ఱెలన్ మఱి మేఁకలన్ మఱి గోవులన్ మఱి గిత్తలన్
వెఱ్ఱిగొల్లల మాచు నిట్టుల వెంటఁదోలుక వచ్చుచున్
గఱ్ఱికంపలఁ గొట్టుకొంచును గంజికూడు భుజించుచున్
బఱ్ఱపచ్చికలందు ద్రిమ్మఱు వార మెంతయుఁ దృప్తితోన్
ఒక్కటొక్కటిగాఁ జరించుచు నూహనేర్వని యీపశున్
జక్క నొక్కటిగా నొనర్చుచు సాకుచుంట నిధానమై
మక్కువన్ గడుజాగరూకత మామనంబుల నిల్పు చీ
చక్కిలోఁ దిరుగాడఁజేసెదు సర్వదా మునిపుంగవా!"

కం. అని ప్రత్యుత్తర మిడు భా
షణములు వినఁబడెడు నవిగొ స్పష్టములగుచున్
గనుఁగొనఁగ బోదు మేనియుఁ
గనఁబడుదురొ కానబడరొ కనుగొననయెదున్.

తే. అకట ! లేరిందుఁగూడనిరాశయయ్యె
మఱలి పోదమటందువా? మాత! యైన!

యేమొ కనుగొంద మాకొండనెక్కి కొంత
మేఱ యచ్చోట నెవ్వరో మెలఁగుచుండ్రి.

ఉ. కోయలుకొండవారచటఁగొందఱుకాపురముండికొండకున్
సాయములేక వచ్చి పథిసత్యముతప్పి విచారమందు వా
రేయెడఁ గానిపించినను నిక్కడమార్గమటంచుఁ జెప్పియా
ప్యాయము మీఱఁబండ్లనిడి యంపుచునుందురు వారిపట్ల
[కున్.

ద్విరదగతిరగడ

"పుట్టినప్పటినుండి భూధరభూమి
మెట్టి దిట్టల మగుచుమే దినిగామి
త్తార్ధంబులవియెల్ల యందియుండినమచ్చు
స్వార్ధమెంచక స్వేచ్ఛ సంచారములఁ బుచ్చు
చుందుమే యెల్లప్పు డోఁనగూడునట్టి
విందొనర్చెడు పండ్లవింత ధాన్యముఁగొట్టి
క్షుత్తు తీఱెడు తీరుగొనుచు మేమిచ్చోట
నెత్తైనగిరు లెక్కియిందుఁజిక్కనిబాట
దారితప్పినజనుల దారి తిన్నగఁదీసి
వారికాతిథ్యంబు పచరించుచునువాసిఁ
గాలముఁగడపుటే ఘనమంచు మదినెంచి
యేలఁబ్రశ్నించెదో యీరీతి మముఁగొంచి?"

చం. అన మునివాక్సదు త్తరములౌజనులాడెడు పల్కులెల్ల ఘ
మ్ముగనగిరిగహ్వరమ్ములను మ్రోసెడు వేబ్రతిశబ్దమీనుచిం
కను తెలియంగనేరమ? కనందగు నీచటినంటి యెక్కుచో
వినబడువారిభాషణము వెంటనెనెమ్మదినోర్పు తాప్చుచో30

మ. అకటా! యెక్కఁగనేర మిప్పటికె యాయాసంబు [మెండయ్యె న
య్యకలంకుండగుమాని బాలకునితో నత్యున్నతంబైన కొం
డకొసన్ వేగమ యెట్లుతెక్కెనొకొ చూడంబోలునాహారలీ
సకలక్షోణివిలోకనాద్భుతమునన్ సంతుష్టులై యుందు రే.

కం. మనమింక నెక్కనేరము
కనుగొలఁకుల జాఱుబాష్పకణములు పోవన్
వినవచ్చు వారిపలుకుల
వినవమ్మా! యిందెయుండి విమలతపస్విన్.

ఉ. ‹బాలక! యింతవట్టునకు వచ్చిన మార్గమునందుఁజూపునా
లీలలు సంగ్రహించితివొ లేదొ యెఱుంగ దలంచుచుంటి నీ
శీలము స్పష్టమాకరణిఁ జెప్పుము,కాంచుచువిన్నవాఁడవా
పాళికుఁబల్లెజవ్వనిని నావయి గొల్లల గోయువారలన్?

సీ. నుదుటఁజెమ్మట చిమ్మ నుదయాస్తమయములు
హాలముచేపట్టెడు పాళికుండు
వండలు గడిఁదేఱ నిండుజలంబులఁ
బడవనుగడవేయుపల్లెపడఁతి

కాళ్లుకాయలుఁగాయ కాననభూముల
గోగణంబులగాయు గోపకుండు
గొంతు బొంగురువోవ గుహ లంటి గిరు లంటి
విగతమార్గస్థులఁ బిలచుకోయఁ 35
డెడఁదలం దొక్కయుద్దేశ్య మినునుడించి
మేఱ యయ్యది తమకనుమితి నెఱింగి
తృప్తివడి నిచ్చ ముదములఁ దేలుచుండు
రట్లు జీవింప నేర్తురే యందఱవని? 35

చం. కనుగొను మద్రి కీపెడను గాంచినదాఁక నొకేవిధంబుగన్
ఘనఘనగాఢనీలపరికల్పితవర్ణము, మారుతప్రతి
స్వనము తరంగతాడితవిచంచలఫేనము మీఱునాగుని
వ్వననిధిపైఁ బ్రయాణు లగువారల నెల్లఱ నాదు
[బాలకా! 36

ఉ. వారికి నొక్కత్రోవ కనుపట్టదు వాయువు లెట్లు వీవ, నా
దారినిఁ బట్టి సాగెదరు; దండిఁ జెలంగెడుభంగఘట్టనన్
గోరినవాని వీడుదురు; కొండొకముత్తెము తళ్కులీనుచో
బోరన నందఱాదరికిఁ బోయిమునింగెడువారుపోరునన్ 37

ఉ. ఏకమతంబు లేక మదినింద్రియవాంఛలఁ బంచి వంచి, ని
త్యాకులు లై యమర్త్యపరిహాసపుఁబాత్రుల రై చిరా [యువున్
జేకురుపూర్ణ సౌఖ్యములఁ జెందఁగ నేరక చూచుచుండఁగా
నేకడ నో విషాదమున నీల్గెడువారలు నిర్మలాత్మ్మఁడా! 38

ఉ. నీ వొకపిన్న పాపఁడవు నిష్కలుషాత్మ్మఁడ వట్టినీవు నా
త్రోవను నొక్కదాని కనుదోయికినిబ్బరమంచు నెంచి లో
భావనఁ జేసికొన్న మనవచ్చును నిత్యము, నీదుకాంతియే
త్రోవగుజూపుఁ దజ్జలధిరోదన వేదనఁ బొందువారికిన్ 39

మ. భవదీయధ్రువబుద్ధి యీగిరిపయిన్ భాసిల్ల నెవ్వారు ని
న్నవలోకింపఁగఁ గోరుచుండెదరు నిన్నాదర్శనీయంబుగా
సువిచారుల్ మునిముఖ్యు లెంచెదరు దిక్సోద్యంబ వై [యుందు నీ
కవలన్ వెల్గెడుజ్యోతి కానఁబడదే యం దెంత యా [సించినన్ 40

చ. అని యదె మాయ మయ్యె ముని యాత్మజు తేజముపర్వ [తాగ్రిమున్
వినుతప్రకాశముల్ కొలిపివింతగవెల్గెడుఁగాంచుమమ్మరో!
వనరకుమమ్మ!పోద మిఁక భాసురలీలను శాశ్వతంబుగన్
దనరెడునెల్లవారలకు తానె నిదర్శియటంచుఁ దెల్పుచున్

చ. అతనికిమి త్రిలేదు మనకందఱకుండెడు, నేలయందువో
మతి నతఁడొక్కయాశయము మన్ననఁజేసి చెలంగువాఁ
[డు; సం
తతమునఁజీవితుండు సుమధారుణి మానవులెల్ల వేనవేల్
మతములబూనుచున్ విఫలమానసులైనశియింతురమ్మరో!

---

24 కల

ఆ. బండియొకటి యిటకువచ్చె మాయూరిది
వెళ్ళుచుంటి నిపుడె వెళ్ళుచుంటి
ననుచు సంభ్రమమున నమ్మమ్మతోఁ జెప్పి
పయన మైనవాఁడ బండినెక్కి.

ఆ. మధ్యమధ్య బండి మందంబుగాఁ బోవ
బండివాని లేపి పండుకొనకు
తోలుతోలు మనుచుఁ దొందఱ పెట్టంగఁ
జేరి నార మూరుచేరువునకు.

క. ఆసరికి వేఁగుజుక్కయు
భాసిల్లుచు నుదయ మందెఁ బద్మము విడిచెఁ

గూసెడుఁ గోళ్ళొకటొక్కటి
వేసెడుఁ జలిగాలి గిరుల విచ్చలవిడిగన్. 4

చ. చలియిఁకఁదూఱునాయనుచుజంటపొరల్కలపెద్దదుప్పటిన్
దలపయినుండి పాదములదాఁకనుగట్టిగఁగప్పికిఱ్ఱుచె
ప్పులధ్వనిసేయుచున్నడుముముల్కలకఱ్ఱనునేలఁగొట్టుచున్
బాలమునఁగుప్పనూర్చుకొనఁబోవుకృషీవలునొంటిఁ
[గాంచితిన్. 4

క. కుప్పలకడఁ గాపుండెడు
నప్పాలేరులు చలికిఁకనాఁగఁగ లేఁకే
చొప్పనొ కూర్చుచు మంటల
నొప్పుగ వేసి చలిఁ గ్రాగుచుండుటఁ గంటిన్. 5

ఉ. బందముచేతఁబట్టుకొని పాల్పితుకంగను వెళ్ళుగొల్లనిన్
బొందుగ దూఁడలన్ గదలిపోవకయుండగఁ బట్టుపిల్లనిన్
దొందఱతోడగోవులనుదోలఁగమేలొక్కనుపాలికాఁపుమా
సందునఁబోవుటల్కనుచుసంతసమెచ్చఁగఁబల్కరించితిన్.

మ. అహహాయింటెనిజేరితల్పునిదెబామ్మా!తీయుమాయన్న దా
ఁనువాఁహుహూ,యంచును లేచివచ్చియెవరోకోఁయంచు వేఁ
[దీసిన
న్నోహూహూహో,యంచునులోనికింబిలిచె నేమోయప్డె తెల్లా
[ఱెడున్
రహిఁదెల్లాఱెనటంచులేచితినిసర్వంబంతమాయంబయెన్.

25 ఎఱుఁగరాని

——:o:——

ఆ. వె. నాదుతోఁటలోని లేఁదీవ మృదులంపుఁ
గెంపుఁజివురుతోడుఁగు సొంపుఁ గాంచి
యేటి కిద్ది యనుచు నెంచితి మదిలోనఁ
గాని యహహా! యెఱుఁగరాని యొక్క! 1
నీలమేఘమాల నిబిడంబుగా మూసి
చల్లనైనవాన నల్లఁజిలికె;
నాదు తీవ మిగుల మోదంబు నుప్పొంగి
శిరము వంచి యెత్తి కెరలి యాడె. 2
నాదుతోఁటలోని లేఁదేవ నును మొగ్గఁ
గులుకుచుంటఁగాంచి తలఁచితి నది
యేటి కనుచుగాని యేమనిచెప్పుదు
తెలియరాని యొక్క మలయపవన 3
మల్లరేకుకంట మెల్లన వీచుచు
వలపుఁ జిమ్మె నాల్గువైపులకును;
నాదుతీవ మిగుల మోదంబు నుప్పొంగి
పూలచామరములు లీల విసరె. 4
నాదుతోఁటలోనిలేఁదీవ ఫలముల

ద్రేలుచుంటఁ గాంచి యేటికంటెఁ
గాని మెఱుఁగరానికరపద్మ మొక్కఁడు
రాలఁ జేసి పీల్చి రసము లెల్ల;
నాదుతీవ మిగుల మోదంబు నుప్పొంగి
విత్తనముల నౌర వృద్ధిఁగాంచె.

సంపూర్ణము

సవరణ

పుట	పంక్తి	తప్పు	ఒప్పు.
5	11	లోపమునకే	లోపమనకే
19	8	గనుఁజూపుల	గనుఁజాపుల
24	17	యల్లవేళ్ల	యల్లలేళ్ల
25	15	జీకటి	జీటికి
28	18	మఱ్ఱియోడ	మఱ్ఱినీడ
29	17	చాత్ర	ఛాత్ర
33	1	నవతోయత	నవతోయజ
36	1	అహోహో!	ఆహోహో!
37	4	కలవరమ్ము	కలరవమ్ము
39	13	జలముల్ చేరంగ	జలముల్ చేదంగ
42	1	కావలసినప్పుడు	కావలసినపుడు
47	2	దననొసంగు	దగనొసంగు
56	10	భూషణము	భాషణము
57	15	చిరునవ్ను	చిరునవ్వు
61	4	గలవంతయు	గలవంతము
85	15	మురిపెంపు	మురిపెంబు
94	12	సద్గోష్టి	సద్గోష్ఠి
100	13	గ్రోయ	గోయ

—:కొండకొలఁకు—వికసితోత్పల—శీర్షక:—

{ ఈకవిచేతనే విరచింపఁబడి
అచ్చుపడి విక్రయమునకు సిద్ధముగ నున్నవి }

(1) భావమురళి 0-4-0 (లైబ్రరీలకై ఎప్రూవ్ కాబడ్డది
(2) జనపదములు 0-4-0
(3) కుమారకంఠము 0-4-0
(4) మాతృదేశ సంకీర్తనము 0-4-0
(5) కలకుతము 0-4-0
(6) ప్రకృతిచందనము 0-4-0
(7) ఆత్మవ్యక్తి 0-8-0
(8) నెలబాలుఁడు (వేణువు) (శేషఫణితి) } 0-12-0 (లైబ్రరీలకై ఎప్రూవ్ కాబడ్డది)

1, 2, 3, 4, 5 పొత్తములు కలిపి — రు 1—0—0
6, 7, 8 పొత్తములు కలిపి — రు 1—0—0

వలయుచో

కవికొండల వేంకటరావుగారు

నరసాపురము

పశ్చిమగోదావరి

ఆని వ్రాసినఁ బడయఁగలరు.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA119B197
పుస్తకం పేరు	వివిధకుసుమావళి
తారీఖు	28/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	113
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Rehama
పేజీలు విడదీసినది	Rehama
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	THASIN [illegible]
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good